

దర్శించండి - తరించండి

స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం

కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.

సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...

శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి

శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్

A/c No. 30178925930, IFSC No. SBIN0010105

మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 94 | ది. 12-7-2026 | ఆదివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 94 | Date : 12-7-2026 | Sunday | Pages : 8 | Rs.1/- |


## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి శస్త్ర చికిత్స విజయవంతం

**విజయవాడ, జూలై 11 (వార్తాప్రభ) :** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి ముంబయిలో నిర్వహించిన శస్త్ర చికిత్స విజయవంతం అయింది. ప్రపంచ ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ మెడిసిన్ నిపుణుడు డా.దిన్షా పార్థీవాలా నేతృత్వంలోని వైద్యుల బృందం పవన్ కళ్యాణ్ కుడి భుజానికి సర్జరీ నిర్వహించారు. రొటేటర్ కఫ్ ఇంజ్యూరీతోపాటు, భుజానికి అవల్షన్ ఫ్రాక్చర్ ఉండటంతో భారీ సర్జరీ చేయాల్సి వచ్చింది. ఈ సర్జరీకి మూడున్నర గంటల సమయం పట్టింది. ఆపరేషన్ థియేటర్ నుంచి రికవరీ రూమ్ కి తీసుకువచ్చారు. అనస్తీషియా ప్రభావం నుంచి బయటకు వస్తున్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు.

# జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తు

- జనాభా నిర్వహణ దేశానికి, రాష్ట్రానికి అత్యవసరం
- ప్రజలతో సంప్రదించి 'పిల్లలే సంపద' కార్యక్రమం
- యువత నైపుణ్యం-వృద్ధుల అనుభవం సమాజానికి ఆస్తి
- మైక్రో ఫ్యామిలీలు వద్దు, ఉమ్మడి కుటుంబమే ముద్దు
- ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు






**అమరావతి,జూలై 11 (వార్తాప్రభ) :** జనాభా నియంత్రణ కాకుండా జనాభా సంరక్షణ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సమీప భవిష్యత్తులోనే 'పిల్లలే సంపద' అనే మాటను నిజం చేసి చూపుతామని సీఎం అన్నారు. విజయవాడలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. గతంలో జనాభా నియంత్రణ కోసం ప్రభుత్వాలు పనిచేశాయని దీని కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు కలిగిన వారిని అనర్హులు చేస్తూ నిబంధనలు కూడా తెచ్చామని... ప్రస్తుతం పరిస్థితులు మారాయని సీఎం స్పష్టం చేశారు. దీనికి అనుగుణంగా ఇప్పుడు విధానాలను మార్చుకోవాల్సిన తరుణం వచ్చేసిందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోనూ, రాష్ట్రంలోనూ ఫెర్టిలిటీ రేట్ గణనీయంగా పెరగాల్సిన అవసరం ఉందని... భవిష్యత్తులో జనంతోనే అభివృద్ధి, జనాభా ఉంటేనే భవిష్యత్తుగా పరిస్థితులు మారతాయని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా 40కిపైగా దేశాల్లో జనాభా తగ్గిపోతోందని ఆయన అన్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."పిల్లలే సంపద కార్యక్రమానికి ఇవాల్టి నుంచే నాంది పలకాలని భావిస్తున్నాం. దేశమంటే మట్టి కాదోయ్-దేశమంటే మనుషులోయ్ అని గురజాడ చెప్పిన మాటల్ని మరో మారు గుర్తు చేసుకోవాల్సిన అవసరం వచ్చింది. జనాభా నియంత్రణ కాదు జనాభా సంరక్షణ కార్యక్రమాల్ని ప్రభుత్వం చేపడుతుంది. గతంలో జనాభా నియంత్రణపై ఆలోచన చేశాం. దానికి అనుగుణంగా ప్రభుత్వాలు కార్యక్రమాలు చేపట్టాయి. మహిళల్లో అక్షరాస్యత పెరిగితేనే జనాభా నియంత్రణ సాధ్యమని అప్పట్లో ఆలోచన చేశాం. స్థానిక సంస్థల్లో ఇద్దరి కంటే ఎక్కువ పిల్లలు ఉంటే పోటీకి అనర్హత అనే నిబంధనలు కూడా పెట్టాం. ఒక్కరు ముద్దు, ఇద్దరితో సరి, ముగ్గురు వద్దు అనే లాంటి ప్రచారాలు కూడా చేశాం. 20 ఏళ్ల క్రితం ఐటీ లాంటి విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుని సంపద సృష్టించాం. అప్పుడు ఐటీ, ఇప్పుడు ఏఐ గురించి మాట్లాడుతున్నాను. జనాభా నిర్వహణ గురించి కూడా చర్చిస్తున్నాం. ఆడబిడ్డల్ని చదివిస్తేనే కుటుంబానికి ఆస్తి, గతంలో వరకట్నం ఉండేది ఇప్పుడు ఎదురు కట్నం అనే పరిస్థితి వచ్చింది. అందుకే మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్ గురించి మాట్లాడుతున్నాం. టోటల్ ఫెర్టిలిటీ రేటు మన రాష్ట్రంలోనూ పెరగాల్సి ఉంది. ఎలాంటి అభివృద్ధి అయినా జనాభా ఉంటేనే అది సార్థకం అవుతుంది." అని ముఖ్యమంత్రి అన్నారు.

**అభివృద్ధి కోసం జనాభా నిర్వహణ కీలకం..** "మైక్రో ఫ్యామిలీల గురించి యువత ఆలోచన చేయటం ప్రమాదకరం. ప్రపంచవ్యాప్తంగా 40 దేశాల్లో జనాభా గణనీయంగా తగ్గిపోతోంది. భారత్ లో దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి కూడా అదే. మన అభివృద్ధి సంతులనం కావాలంటే జనాభా నిర్వహణ చాలా కీలకం. అంగన్‌వాడీలు, పాఠశాలల్లోనూ చిన్నారుల సంఖ్య తగ్గుతోంది. వృద్ధుల సంఖ్య పెరుగుతోంది. ప్రతీ వంద మంది జనాభాలో 89శాతం మందికి రెండో సంతానం లేదు. ఏపీలోని విశాఖ లాంటి జిల్లాల్లోనూ ఫెర్టిలిటీ రేటు అతి తక్కువగా ఉంది. ఏపీ విస్తీర్ణంలో 7 స్థానంలో ఉన్నా పాపులేషన్ డెన్సిటీలో దిగువన ఉన్నాం. పిల్లలే మన రాష్ట్ర సంపద. వారితోనే ఆర్థిక ప్రగతి. సరిపడా జనాభా లేకుంటే అనేక సమస్యలు ఉత్పన్నం అవుతాయి. ఆర్థిక ప్రగతి సాధించేలా రాష్ట్రంలో వేగంగా నిర్ణయాలు తీసుకుంటున్నాం. మహిళల్ని పారిశ్రామికవేత్తలుగా తయారు చేస్తున్నాం. పీ4 ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచుతున్నాం. అభివృద్ధి ప్రాజెక్టులు కూడా సమతూకంలో జరగాలనే అన్ని ప్రాంతాలకూ పరిశ్రమలు, ప్రాజెక్టులు వచ్చేలా చూస్తున్నాం. ఆర్థిక అసమానతలు తగ్గించి అందరికీ మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. జనాభా సంరక్షణ అనేదే ఈ సమయంలో కీలకం. జనాభా పెంచాలని మాట్లాడితే విమర్శలు వచ్చాయి. పిల్లలను పెంచటం అనేది కేవలం మహిళలు ఒక్కరిదే బాధ్యత మాత్రమే కాదు అది ఉమ్మడి బాధ్యత. కాన్పుల్లో సిజేరియన్ ఆపరేషన్లు తగ్గాలి. మహిళల ఆరోగ్య రక్షణ అత్యంత కీలకం. జనాభా నిర్వహణ ఇక ఓ వాస్తవిక అంశం అని గుర్తించాలి. సంతానం వద్దనుకునే దంపతులు పెరగటం దురదృష్టకరం. మైక్రో ఫ్యామిలీలు వద్దు- భారతీయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రపంచానికి ఆదర్శం. పిల్లలే సంపద- ఉమ్మడి కుటుంబమే శ్రీరామ రక్ష " అని ముఖ్యమంత్రి వివరించారు.

**సామాజిక మాధ్యమాలతో మానసిక సమస్యలు..** "ఇవాళ తెలంగాణాలో జరిగిన ఘటన అత్యంత బాధాకరం. పోక్సో కేసులో ఉన్న నిందితుడు తనపై కేసు పెట్టిన వారి కుటుంబంలో 6 గురిని హత్య చేశాడు. అత్యంత దారుణమైన ఘటన ఇది. సామాజిక మాధ్యమాలు బాధ్యతారహితంగా వినియోగించటం, అసభ్యకరమైన, హింసాత్మక దృశ్యాల కారణంగా మానసిక సంతులన కోల్పోతున్నారు. విలువైన సమయాన్ని కూడా వృథా చేసుకుంటున్నారు. సోషల్ మీడియా వ్యసనంగా మారితే ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తుతాయి. టెక్నాలజీ- స్పిర్చువాలిటీ ద్వారా యువతకు ప్రపంచాన్ని జయించే శక్తి సొంతం అవుతుంది. ప్రజల ఆరోగ్య సంరక్షణ కోసం సంజీవని కార్యక్రమం చేపట్టాం. యువతతో పాటు వృద్ధులు సమాజానికి ఆస్తిగా తయారు కావాలి. త్వరలో ప్రభుత్వం

# భారత ఐటీ పరిశ్రమ "ఏఐ యాజ్ ఎ సర్వీస్" దిశగా ముందుకు సాగాలి

**--ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికత కింద భారత ఏఐ, సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ వృద్ధిలో హైదరాబాద్ పాత్ర కీలకం: :: కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్**



**హైదరాబాద్,జూలై 11 (వార్తాప్రభ) :** భారత్ సొంతమైన విశ్వసనీయ ప్రపంచ ఖ్యాతిని, నైపుణ్యం కలిగిన ప్రతిభావంతులను సద్వినియోగం చేసుకుంటూ... భారత ఐటీ పరిశ్రమ సాఫ్ట్‌వేర్ సేవల ఆధారిత నమూనా నుంచి "ఏఐ యాజ్ ఏ సర్వీస్" నమూనాకు మారాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, రైల్వేలు, సమాచార, ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్ (హెచ్‌వైఎస్ఈఏ) ఆధ్వర్యంలో "వికసిత్ భారత్-2047 నిర్మాణంలో సాంకేతికత పాత్ర" అంశంపై హైదరాబాద్ ఇండస్ట్రీ లీడర్ టౌన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వైష్ణవ్ ప్రసంగించారు. ఈ కార్యక్రమం అనంతరం పరిశ్రమ ప్రముఖులతో రౌండ్‌టేబుల్ చర్చ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి వైష్ణవ్‌తో పాటు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. పరిశ్రమల ప్రముఖులనుద్దేశించి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వికసిత్ భారత్-2047 దార్శనికతకు అనుగుణంగా కృత్రిమ మేధ, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తయారీ, అధునాతన మౌలిక సదుపాయాల కల్పన ద్వారా భారత తదుపరి దశ వృద్ధి సాధ్యమవుతోందన్నారు. ఐటీ పరిశ్రమను కృత్రిమ మేధ మౌలికంగా మార్చేసిందని పేర్కొంటూ... ప్రతీ కొత్త ఏఐ నమూనా కొత్త సామర్థ్యాలను, అవకాశాలను తీసుకువస్తుందన్నారు. పరిశ్రమలను అర్థం చేసుకోవడం, సమస్యలను గుర్తించడం, సమర్థమైన సాంకేతికత ఆధారిత పరిష్కారాలను అందించడం ద్వారా ప్రపంచవ్యాప్తంగా సంపాదించిన విశ్వాసమే భారత్ అతిపెద్ద బలమని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. వ్యూహాత్మక మార్పు ఆవశ్యకతను ప్రధానంగా ప్రస్తావిస్తూ... భారత ఐటీ పరిశ్రమ ఇప్పుడు సాఫ్ట్‌వేర్-యాజ్-ఎ-సర్వీస్ నమూనాను దాటి, ఏఐని ఒక సేవగా అందించే (ఏఐ యాజ్ ఎ సర్వీస్) నమూనా దిశగా పరిణామం చెందాలని వైష్ణవ్ సూచించారు. పరిశ్రమల, విద్యాసంస్థల మధ్య సన్నిహిత సహకారంతో ఈ పరివర్తనను ముందుకు నడిపించాలని ఆయన కోరారు.

# సౌత్ కొరియాలో విజయవంతమైన మంత్రి లోకేష్ పర్యటన

- భారత్-కొరియా సంబంధాల బలోపేతంలో నూతన అధ్యాయం
- వారంరోజుల పర్యటనలో 50కి పైగా కంపెనీలతో పెట్టుబడి చర్చలు
- లోకేష్ స్పీడ్ చూసి పల్లి..పల్లి మంత్రి అంటూ కొరియన్ ప్రతినిధుల ప్రశంసలు




**సియోల్ (సౌత్ కొరియా),జూలై 11 (వార్తాప్రభ) :** భారత్ -- కొరియా సంబంధాల బలోపేతమే లక్ష్యంగా రిపబ్లిక్ ఆఫ్ కొరియా (సౌత్ కొరియా) ఆహ్వానం మేరకు రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ చేపట్టిన సౌత్ కొరియా పర్యటన విజయవంతమైంది. మంత్రి లోకేష్ బృందానికి దక్షిణ కొరియా ప్రభుత్వంతోపాటు అక్కడి పారిశ్రామికవేత్తల నుంచి సముచిత గౌరవం లభించింది. ఎల్జీ లాంటి గ్లోబల్ కంపెనీలు ప్రత్యేకంగా తమ హెడ్ క్వార్టర్స్ కు ఆహ్వానించి ఉన్నతస్థాయి బృందంతో గౌరవార్థ విందు ఇవ్వడం మంత్రి లోకేష్‌కు దక్కిన అరుదైన గౌరవం. ఈనెల 5నుంచి 11వరకు నిర్వహించిన అధికారిక పర్యటనలో 50కి పైగా కార్పోరేట్ సంస్థల నాయకత్వాన్ని కలిసి ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడులు పెట్టాల్సిందిగా లోకేష్ కోరారు. తొలిరోజు సియోల్ లో తెలుగు ప్రజలతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంతో ప్రారంభమైన పర్యటన... శుక్రవారం సీఐఐ ఆధ్వర్యాన పెట్టుబడిదారులతో నిర్వహించిన రోడ్ షోతో ముగిసింది. రాష్ట్రంతో ద్వైపాక్షిక, రాజకీయ, వాణిజ్య సహకారాన్ని బలోపేతం ప్రాధాన్యతను గుర్తిస్తూ, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రిత్వ శాఖ మంత్రి లోకేష్‌ను అధికారికంగా ఈ పర్యటనకు ఆహ్వానించింది. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ తో నిర్వహించిన భేటీల అనంతరం ఎల్జీ, హ్యుందయ్, శాంసంగ్, బీఎన్ కే ఫైనాన్షియల్ వంటి దిగ్గజ కొరియన్ కార్పోరేట్ సంస్థలు, తమ ఉన్నత నాయకత్వంతో సంప్రదించి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చాయి. ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న స్పష్టమైన పారిశ్రామిక విధానాలు, అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాలు, అందజేస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి లోకేష్ ఇచ్చిన ప్రజెంటేషన్ తో వివిధ సంస్థల ప్రతినిధి బృందాలు ఫిదా అయ్యాయి. పర్యటన తొలిరోజున సియోల్ లో భారత రాయబారి గౌరంగలాల్ దాస్ తో నిర్వహించిన మర్యాదపూర్వక భేటీలో కొరియా ప్రాధాన్యతారంగ పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ ఆంధ్రప్రదేశ్ విజన్‌ను ఆవిష్కరించారు. దక్షిణ కొరియా ప్రముఖ వాణిజ్య కేంద్రమైన బుసాన్ లో ఏపీఈడీబీ ఆధ్వర్యాన అపెక్స్ -- కొరియా (Andhra Pradesh External Engagement - Koreaμ) పేరిట పెట్టుబడిదారుల సహాయక, అనుసంధాన విభాగం (Investor facilitation and outreach cell)ను ప్రారంభించడం ఆంధ్రప్రదేశ్ ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలకు నిదర్శనం. శ్రీసిటీ పరిసరాల్లో ఇప్పటికే కొలువై ఉన్న 40కిపైగా కొరియన్ కంపెనీలతోపాటు కొత్తగా వచ్చేందుకు ఆసక్తి చూపే సంస్థలకు భరోసా ఇచ్చినట్లయింది. ఆంధ్రప్రదేశ్ లో కేవలం రెండేళ్ల వ్యవధిలో 'కియా' సాధించిన విజయాన్ని ఉదహరిస్తూ, ఏపీ ప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలు, 3ఎస్ మోడల్ (స్పీడ్, స్టెబిలిటీ, సర్వీస్), వేగవంతమైన అనుమతులపై మంత్రి లోకేష్ వివరించిన తీరుపై కొరియా మీడియా, దిగ్గజ కంపెనీలు సానుకూలంగా స్పందించాయి. ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ బృందం పర్యటనపై కోట్రా (ఖశోత్రు) దక్షిణాసియా విభాగాధిపతి క్యుంగ్‌హూన్ కిమ్ ప్రశంసల వర్షం కురిపిస్తూ... నారా లోకేష్ బృందానికి హ్యాట్సాఫ్ అంటూ ట్విట్టర్ లో అభినందనలు తెలపడం పర్యటన విజయవంతానికి నిదర్శనం. కొరియన్ ప్రతినిధులు మంత్రి లోకేష్ వేగం చూసి పల్లి..పల్లి మంత్రి అని కొత్త పేరు పెట్టారు. పల్లి..పల్లి అనే కొరియన్ పదానికి అర్థం త్వరగా.. త్వరగా అని. వారంరోజుల అధికారిక పర్యటనను పెట్టుబడుల యాత్రగా మార్చిన మంత్రి లోకేష్ లౌక్యం రాష్ట్రాభివృద్ధిపై ఆయనకున్న చిత్తశుద్ధి, కమిట్ మెంట్ ను తెలియజేస్తోంది.


దేవదాయ ధర్మదాయ శాఖ

## శ్రీ భీమేశ్వరస్వామివారి దేవస్థానము, బంటుమిల్లి రోడ్, గుడివాడ

### షాపుల టెండరు కం బహిరంగ వేలం పాట ప్రకటన

కృష్ణాజిల్లా, గుడివాడ పట్టణం, బంటుమిల్లి రోడ్‌లో వేంచేసియున్న శ్రీ భీమేశ్వర స్వామివారి దేవస్థానంనకు చెందిన ఈ దిగువ షెడ్యూలు నందు గల షాపులు అద్దె లైసెన్సు హక్కునకు స్వాధీనపరచిన కాలం నుండి 3 సం॥ల కాలపరిమితికి ది. 16-7-2026 గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు శ్రీ స్వామివారి దేవస్థానం వద్ద శ్రీ తనిఖీదారు గారు మరియు దేవదాయశాఖ, గుడివాడ వారి సమక్షంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి గారిచే లీజు పాటకు బహిరంగ వేలం పాట నిర్వహించబడును. కావున ఆసక్తి కలవారు ఈ వేలం పాటలో పాల్గొనవచ్చును.

| వ.నెం. | షాపు నెం. | విస్తీర్ణం (అడుగులలో) | షాపుకు ధరావతు | కాలపరిమితి |
|---|---|---|---|---|
| 1 | 7/125 | 6X 8 | 10,000/- | ది. 1-9-2026 నుండి ది. 31-8-2029 అనగా 3 సంవత్సరములకు |
| 2 | 7/140 | 6X 4 | 10,000/- | |

**కొన్ని ముఖ్యమైన షరతులు**

1. ఈ బహిరంగ వేలం పాట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారిచే జరుగుచున్నది.
2. ఈ వేలంపాటలో పాల్గొనుటకు దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారు గాని లేదా లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు.
3. హెచ్చుపాటదారుడు స్వయముగా వ్యాపారం చేసుకొనవలెను. ఎవరికి సబ్‌లీజు గాని, వేరొకరికి బదలాయించుట గాని చేయరాదు.
4. హెచ్చు పాటదారుడు షాపునందు చట్టవ్యతిరేకమైన మత్తు పదార్థములు గాని, పానీయములు గాని విక్రయించరాదు. మరియు మతపరమైన కార్యక్రమములు చేయరాదు.
5. పాటదారుడు ధరావతుతోపాటు 1 లక్ష విలువగల సాల్వెన్స్ సర్టిఫికెట్ ఇవ్వవలెను.
6. హెచ్చుపాటదారుడు ప్రథమ ధరావత్తుగాక 6 నెలలు అద్దె డిపాజిట్ వెంటనే చెల్లించి తగు రశీదు పొందవలెను. అట్లు చెల్లించని యెడల పాట హక్కును రద్దుపరచి ధరావతుగా చెల్లించిన సొమ్మును అపరాధము క్రింద దేవస్థానమునకు జమచేసి సదరు షాపులను మరల బహిరంగవేలం నిర్వహించబడును. సదరు 6 నెలలు అద్దె కాలపరిమితులు ముగిసిన పిదప ఖాళీ చేయునపుడు తిరిగి యిచ్చు నిర్ణయం. దీనికి వడ్డీ ఇవ్వబడదు.
7. సదరు బహిరంగవేలం పాటకు ముందుగా ప్రతి పాటదారుడు షాపులను వివరముగా చూసుకొని పాల్గొనవలయును. తదుపరి ఎటువంటి తగాదాలు చేయరాదు.
8. ఇతర వివరములకు దేవస్థానం ఆఫీసు పనిచేయు దినములలో సంప్రదించవలెను.
9. శ్రీ స్వామివారి దేవాలయ అభివృద్ధి పనులు చేయు సందర్భములో షాపును తొలగించవలసినచో అంగీకరించవలెనే తప్ప తగాయిదా పడరాదు.

ఇట్లు

గుడివాడ
ది. 6-7-2026

సం. కె.వి. గోపాలరావు
కార్యనిర్వహణాధికారి


# వియత్నాంలో ఘోర ప్రమాదం..

- ఏపీ, తెలంగాణ వాసులతో వెళుతున్న బోట్ మునక... 15 మంది మృతి
- వియత్నాంలో భారత పర్యాటకులతో వెళుతున్న స్పీడ్‌బోట్ బోల్తా
- ప్రమాదంలో గాయపడిన పలువురి పరిస్థితి విషమం
- ఫు క్వాక్ దీవి సమీపంలో అదుపుతప్పిన పడవ
- రంగంలోకి దిగిన భారత ఎంబసీ.. సహాయక చర్యలు ముమ్మరం



**విజయవాడ,జూలై 11 (వార్తాప్రభ) :** వియత్నాంలో భారత పర్యాటకులతో ప్రయాణిస్తున్న ఒక స్పీడ్ బోట్ సముద్రంలో బోల్తా పడి మునిగిపోయింది. ఫు క్వాక్ ద్వీపం సమీపంలో శనివారం ఉదయం చోటుచేసుకున్న ఈ ఘోర ప్రమాదంలో కనీసం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ప్రతికూల వాతావరణం పరిస్థితుల కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్లు ప్రాథమిక సమాచారం. ఓషన్ పెరల్ ఐలాండ్ కంపెనీకి చెందిన 'ఏజీ-26751' అనే పర్యాటక స్పీడ్ బోటులో భారత పర్యాటకులు సిబ్బందితో కలిసి విహారయాత్రకు వెళ్లారు. ఫు క్వాక్ దీవి సమీపంలోని హోన్ మే రుట్ స్గోయి ప్రాంతంలో ప్రయాణిస్తున్న సమయంలో, బలమైన గాలులు మరియు అలల ఉధృతికి పడవ అదుపుతప్పి బోల్తా పడింది. స్థానిక అధికారులు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు సుమారు 21 మందిని రక్షించగా, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. గల్లంతైన వారి కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి.

# ఏపీలోని ఓటర్లకు అలర్ట్, జులై 14లోపు ఫారాలు ఇవ్వకుంటే ఓటు గల్లంతు




**అమరావతి,జూలై 11 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్లో ఓట్ల సవరణ ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. ఈ నెల 14వ తేదీలోపు ఓటర్లు తమ ఎన్యూమరేషన్ ఫారాలను బీఎలీలకు అందించాలని అధికారులు తెలిపారు. గడువులోపు ఫారాలు సమర్పించని వారు ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ విధుల్లో 46,000 మందికి పైగా బీఎల్ఎలు నిమగ్నమై ఉన్నారు..

## చంద్రబాబు దూరదృష్టికి నిదర్శనం పట్టిసీమ

పట్టిసీమతో పచ్చదనానికి పునాది



**హనుమాన్ జంక్షన్,జూలై 11 (వార్తాప్రభ) :** పట్టిసీమ ద్వారా కృష్ణా--గోదావరి నదుల అనుసంధానంతో కృష్ణా డెల్టా సస్యశ్యామలమైందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ళ వెంకట గోపాలకృష్ణారావు అన్నారు. బాపులపాడు మండలం రంగన్నగూడెం వద్ద పోలవరం కుడికాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలకు శనివారం రైతులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులతో కలిసి జలహారతి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టిన పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా ఇప్పటివరకు 443 టీఎంసీల గోదావరి జలాలు కృష్ణా డెల్టాకు చేరాయని తెలిపారు. దీంతో ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 13 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో రైతులకు భారీ ప్రయోజనం కలిగిందన్నారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల్లో కూడా పట్టిసీమ పంపులను ప్రారంభించి కృష్ణా డెల్టాకు గోదావరి జలాలు విడుదల చేయడం రైతులకు ఎంతో ఉపయుక్తమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్, నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు, అధికారులు పాల్గొన్నారు.

## జనాభా పెరుగుదలతో పాటు మానవ వనరుల అభివృద్ధిపైనా దృష్టి పెట్టాలి

– ప్రపంచ జనాభా దినోత్సవ సెమినార్‌లో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ సమరం




**విజయవాడ,జూలై 11 (వార్తాప్రభ) :** దేశాభివృద్ధిని వేగవంతం చేయాలంటే యువ జనాభా అవసరమే అయినప్పటికీ, కేవలం జనాభా పెరుగుదలపై దృష్టి పెట్టడం కాకుండా పుట్టే ప్రతి బిడ్డను నాణ్యమైన మానవ వనరుగా తీర్చిదిద్దడంపైనే ప్రభుత్వాలు, సమాజం ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్టీఆర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ సమరం పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో విజయవాడలోని ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశానికి యువశక్తి గొప్ప సంపద అని, అయితే వారికి పోషకాహారం, నాణ్యమైన వైద్యం, పూర్తి టీకాలు, మెరుగైన విద్య, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించకపోతే అదే జనాభా భారంగా మారే ప్రమాదం ఉందన్నారు. జనాభాను కేవలం సంఖ్యల పరంగా కాకుండా మానవ వనరుల కోణంలో చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవలి కాలంలో దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో జననాల రేటు తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో పని చేసే వయస్సు గల యువత సంఖ్య తగ్గి, వృద్ధుల జనాభా పెరిగే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందన్నారు. వివాహాలు ఆలస్యం కావడం, ఒకే బిడ్డతో సరిపెట్టుకోవడం, ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగ ఒత్తిళ్లు, జీవనశైలిలో వచ్చిన మార్పులు ఇందుకు ప్రధాన కారణాలని వివరించారు. జపాన్, ఇటలీ వంటి అభివృద్ధి చెందిన దేశాలు ఇప్పటికే తక్కువ జననాల రేటు కారణంగా కార్మికుల కొరత, ఆర్థిక వృద్ధి మందగమనం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నాయని గుర్తు చేశారు. భారతదేశం ఈ పరిస్థితిని ముందుగానే అంచనా వేసి సమతుల్య జనాభా విధానాలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మహిళల ఆరోగ్యం, విద్య, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, గర్భిణీలకు నాణ్యమైన వైద్య సేవలు, పోషకాహారం, రక్తహీనత నివారణ చర్యలు అందుబాటులో ఉండాలని సూచించారు. శిశువులకు పూర్తి టీకాలు, సరైన పోషణ, బాల్య సంరక్షణతో పాటు యువతకు శాస్త్రీయ లైంగిక విద్య, ప్రజారోగ్య అవగాహన, కుటుంబ జీవితానికి అవసరమైన శిక్షణ, మానసిక ఆరోగ్యంపై మార్గదర్శకత్వం కల్పించడం అవసరమన్నారు. ఆరోగ్యవంతమైన కుటుంబాలు, విద్యావంతమైన యువత, మహిళలకు సమాన అవకాశాలు, శాస్త్రీయ దృక్పథం కలిగిన సమాజ నిర్మాణమే దేశాభివృద్ధికి బాటలు వేస్తుందని, జనాభాను భారంగా కాకుండా దేశ ప్రగతికి శక్తివంతమైన మానవ వనరుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ సమరం పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వీర్రాజు అధ్యక్షత వహించారు. యూత్ రెడ్ క్రాస్ సభ్యులు, విద్యార్థులు, అధ్యాపకులు, కళాశాల సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వెలగలేరులో జలహారతి..!

● మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సూచనలతో పట్టిసీమ జలాలకు హారతి ఇచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు





**జి.కొండూరు,జూలై 11 (వార్తాప్రభ) :** కృష్ణా డెల్టాకు జీవనాడిగా నిలిచిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా విడుదల చేసిన గోదావరి జలాలు శనివారం జి.కొండూరు మండలంలోని వెలగలేరు గ్రామానికి చేరాయి. ఈ సందర్భంగా మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు సూచనలతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెలగలేరు గ్రామంలో జలహారతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత జంపాల సీతారామయ్య, పోలవరం కుడి ప్రధాన కాలువ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె. శ్రీనివాస్ తదితరులు గోదావరి జలాలకు పూలు చల్లి హారతి ఇచ్చి ఇచ్చారు. అనంతరం పలువురు టీడీపీ నాయకులు మాట్లాడుతూ పట్టిసీమ ఎత్తిపోతల పథకం కరువు కాలంలో కృష్ణా డెల్టాకు అండగా నిలుస్తూ రైతాంగానికి భరోసా కల్పిస్తోందన్నారు.గోదావరి జలాలను కృష్ణా నదికి తరలించడం ద్వారా సుమారు 13 లక్షల ఎకరాల కృష్ణా డెల్టా ఆయకట్టుకు సాగునీటి వసతి కలుగుతుందని తెలిపారు.మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి పట్టిసీమ దండగ అన్నాడని, సీఎం చంద్రబాబు అప్పట్లో పట్టిసీమను సమర్థవంతంగా పూర్తిచేయబట్టే నేడు ఎల్ నినో ప్రభావంతో వర్షాలు లేకున్నా రైతులకు సకాలంలో సాగునీరు లభిస్తుందన్నా రు.ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెమ్ ఇందిరా ప్రియదర్శిని, టీడీపీ మండల అధ్యక్షుడు వేములకొండ వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి లంకా నాగేశ్వరరావు, వెలగలేరు సొసైటీ అధ్యక్షుడు మంచినేని రాజశేఖర్, ఏఎంసీమాజీ చైర్మన్ వుయ్యూరు నరసింహారావు, టీడీపీ నాయకులు పచ్చిగోళ్ళ బాలకృష్ణ, ఆలూరి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## కోట్ల రూపాయల ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరేనా?

● కొత్త రోడ్లపై ఇనుప చక్రాల ట్రాక్టర్లు.



**తిరువూరు,జూలై 11 (వార్తాప్రభ) :** దశాబ్దాల నిరీక్షణ తర్వాత తిరువూరు మండల ప్రజలకు నాణ్యమైన రహదారులు అందుబాటులోకి వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు చొరవతో ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి పలు గ్రామాల్లో కొత్త రోడ్లను నిర్మించింది. ప్రజల ప్రయాణ సౌకర్యం కోసం నిర్మించిన ఈ రహదారులు కొందరి నిర్లక్ష్యంతో మళ్లీ దెబ్బతింటున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవసాయ పనుల కోసం ఇనుప చక్రాలు అమర్చిన ట్రాక్టర్లను నేరుగా కొత్త రోడ్లపై నడపడం వల్ల రహదారి ఉపరితలం దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు అవసరమే అయినా, ప్రజల సొమ్ముతో నిర్మించిన రోడ్లను పాడుచేయడం సమంజసమేనా? అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.. కోట్ల రూపాయలతో నిర్మించిన రోడ్లను కాపాడే బాధ్యత ఎవరిది? ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంటే, కొందరి నిర్లక్ష్యం వల్ల అదే అభివృద్ధి మళ్లీ వెనక్కి వెళ్లే పరిస్థితి రావడం బాధాకరం. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి పరిస్థితిని పరిశీలించి, ప్రజా ఆస్తులకు నష్టం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనం ఎవరి సొత్తు కాదు... అది ప్రతి పౌరుడి బాధ్యత. రోడ్లను నిర్మించడం ఎంత ముఖ్యమో, వాటిని పరిరక్షించడం కూడా అంతే ముఖ్యం.

## గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగతే కృష్ణ మిల్క్ యూనియన్ లక్ష్యం

–కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు



**విస్సన్నపేట,జూలై 11 (వార్తాప్రభ) :** తిరువూరు క్లస్టర్ పరిధిలో విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి,చేపూరివారిపాలెం పాల సంఘాలను కృష్ణ మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పాడి రైతుల అభివృద్ధి సహకార పాల ఉద్యమ బలోపేతం గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగతి కృష్ణ మిల్క్ యూనియన్ లక్ష్మశీ అని చెప్పారు.జిల్లా పాలక వర్గసభ్యులు నెక్కళ్లపు వాణిశ్రీ ,సంఘ అధ్యక్షురాళ్లు రాయల రమాదేవి సత్య అరుణ కుమారి క్లస్టర్ మేనేజర్ పి.ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పాడి రైతు ప్రతి రోజు కష్టపడి ఉత్పత్తి చేసే పాలకు సరైన గౌరవం, సరైన ధర, సమయానికి చెల్లింపు అందించడమే మా బాధ్యత అని అన్నారు. కృష్ణ మిల్క్ యూనియన్ రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ పాలధరల పెంపు, బోనస్‌లు, పశువైద్య సేవలు, పశుగ్రాస అవగాహన, ఆధునిక పాడి పద్ధతులపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు.నాణ్యమైన పాల ఉత్పత్తి ద్వారా అధిక ఆదాయం,పశువులకు సమయానికి టీకాలు, వైద్య సేవల అవసరం,పరిశుభ్రమైన పాల ఉత్పత్తి విధానాలు,రైతులకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రస్తుతం పాడి పరిశ్రమలో నాణ్యతకు ఎంతో ప్రాధాన్యం పెరిగిందని, రైతులు శాస్త్రీయ పద్ధతులు అనుసరిస్తే పాల దిగుబడి పెరిగి మరింత ఆదాయం పొందవచ్చని వివరించారు. పశువులకు తక్కువ ప్రీమియంతో ఇన్సూరెన్స్ చేస్తూ అనుకోని పరిస్థితులలో పశువు మరణించినప్పుడు ఇన్సూరెన్స్ అమౌంట్ అందజేయడం జరుగుతుంది అని చెప్పారు. మొబైల్ వ్యాన్ ఉచిత క్యాంపులు,సర్వీస్ 24ఐ7 నిరంతరం రైతు ఇంటి వద్దకే అందించడం,రైతు మరణించినప్పుడు 50వేల రూపాయలు తక్షణ సాయం, రైతు ఇంట జరిగే పెళ్లికి కళ్యాణమస్తు పథకం ద్వారా గోల్డ్ కాయిన్, ప్రతిభ సర్వీస్, రైతులకు అవసరమైన ఉచిత మెడికల్ క్యాంపు ద్వారా గుండె సర్జరీలు, కంటి ఆపరేషన్లు ఉచితంగా యూనియన్ ద్వారా చేయించడం, రైతు బలపడితేనే మన వ్యవస్థ బలపడుతుందిఅని రైతు నిలబడితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ నిలబడుతుంది అని చెప్పారు.రైతుల సంక్షేమం కోసం భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు,సూపర్వైజర్లు ఎం వెంకట్రావు, బాబు వేతన కార్యదర్శులు జోగారావు, శ్రీనివాసరావు పాడి రైతులు పాల్గొన్నారు.

## ముందస్తు చర్యలు అవసరం

● సూర్యుడు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజేషన్ ఆడెపు సర్వేశ్వరరావు



**విస్సన్నపేట,జూలై 11 (వార్తాప్రభ) :** కరోనా ఉన్నా లేకున్నా మనల్ని మనం వాతావరణంలో ఉన్న విష వాయువుల నుండి రక్షణ పొందేందుకు మాస్కు అవసరమైన సంగతి సర్వత్రా తెలిసిందే అని సూర్యుడు స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్గనైజర్ సర్వేశ్వరరావు ఆడెపు తెలియజేశారు. హాస్పిటల్స్ రద్దీగా ఉండే ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి ప్రాంతాలలో డస్ట్ మన ముక్కులకు సోకకుండా చిన్న చిన్న కణాలను సైతం మాస్క్ ఫిల్టర్ చేస్తుందని ప్రతి ఒక్కరూ మాస్కు ధరించడం వలన తర్వాత కాలంలో కూడ ఆరోగ్యాన్ని వేలాది రూపాయలకు ఖర్చుపెట్టి కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు అని ఆయన చెప్పారు. సర్జికల్ మాస్క్ లేక త్రీ లేయర్స్ మాస్క్ వంటివి రోజువారి బయటకు వెళ్ళేటప్పుడు కూరగాయల మార్కెట్ ఆఫీసులకు వెళ్లిన సమయంలలో సరిపోతుందని,వస్త్ర మాస్క్ రెండు లేదా మూడు లేయర్లు బాగా ఫిట్ అయ్యేవి అయితేనే వాడాలని ఒక లేయర్ ఉన్నవి అంతా ప్రభావంతంగా ఉండమని ముక్కు నోరు మరియు గడ్డం కవర్ అయ్యేలా పెట్టుకోవాలని చంపల పక్కన గ్యాపు ఉండకుండా చూసుకోవాలని మాస్కుని తాకకుండా చెవి లూప్స్ పట్టుకొని తీయాలని సర్జికల్ మాస్కులు అయితే ఒకసారి వాడిన తర్వాత వాటిని బయటి పారవేయాలని చెప్పారు. కోవిడ్ కేసులు ఉన్నా లేకున్నా ఫ్లూ, దగ్గు ఎక్కువగా ఉన్నప్పుడు హాస్పటల్ కి వెళ్ళేటప్పుడు లేదా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న సమయాలలో మాస్క్ వాడటం మంచిదని ఆరోగ్య శాస్త్రవేత్తలు సోషల్ మీడియా ద్వారా చెపుతున్నారు. త్రీ లేయర్స్ మాస్క్ వినియోగం వలన ఎక్కువ ఆరోగ్య రక్షణ పొందవచ్చు అని సమాచారం ఉన్నదని ఆయన తెలియజేశారు.

## "శతాధిక గ్రంథకర్త(104)"గా గద్వాల సోమన్న రికార్డు




**కర్నూలు,జూలై 11 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న నూట నాలుగు (104)పుస్తకాలు వ్రాసి ముద్రించి శతాధిక గ్రంథకర్త గా రికార్డు సృష్టించారు. అతి తక్కువ సమయంలో (దాదాపు 8 సం . రాలు)ఎక్కువ పుస్తకాలు రచించి బాలసాహిత్యంలో అరుదైన రికార్డు నెలకొల్పారు.సంయుక్త తెలుగు రాష్ట్రాల్లో శతాధిక గ్రంథాలు బాలసాహిత్యంలో వ్రాసిన ఒకే ఒక్కడు (గణిత ఉపాధ్యాయుడు)గద్వాల సోమన్న.ఈ సందర్భం పురస్కరించుకొని సంగీత సాహిత్య సాంస్కృతిక సంస్థ, హైదరాబాద్ వారు జూలై 5,2026న, హైదరాబాద్ లో పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ చేతుల మీదుగా "బాల గేయ బ్రహ్మ" బిరుదు ప్రదానం చేయడం గమనార్హం.ఇటీవల కాలంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతులు మీదుగా రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం సోమన్న స్వీకరించడం విశేషం.వృత్తిలో గణితోపాధ్యాయుడైనా ప్రవృత్తి సాహితీ సృజనలో బాలసాహిత్యవేత్తగా వారి అవిరళ కృషికి లభించిన గౌరవం ఇది .బహు కావ్యకర్త గా నిలిచిన సోమన్నను తోటి ఉపాధ్యాయులు,శ్రేయోభిలాషులు అభినందించారు.

## విద్యుత్ స్తంభాల ను ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ కు ధన్యవాదాలు తెలిపిన గాంధీనగరం వాసులు....



**కృత్తివెన్ను,జూలై 11 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలం ఎండపల్లి పంచాయితీ గాధీనగర్ లో న్యూ కాలనీవాసులు శుక్రవారం వంతెన ప్రారంభోత్సవం కార్యక్రమము సందర్భముగా స్తానిక శాసన సభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా వచ్చిన సందర్భముగా కాలనీ వాసులు విద్యుత్ స్తంభాలు వేయించి విద్యుత్ కావాలని అడుగగా వెంటనే స్పందించి శనివారం (13)పదమూడు స్తంభాలును గాంధీనగర్ కాలనీలో కి పంపి వెంటనే పనులు ప్రారంభించాలని అధికారులను ఆదేశించడం జరిగింది.గ్రామస్తులందరు శాసనసభ్యులు కృష్ణ ప్రసాద్ కు ధన్యవాదాలు తెలియచేసారు.ఈ కార్యక్రమములో తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు పిన్నెంటి రత్తయ్య దాసరి శ్రీను బత్తుల పూర్ణ సూదాబత్తుల రమేష్,ఆకులు కృష్ణ,ఈమన శివ పిన్నెంటి సుబ్బరాజు పిన్నెంటి పాండురంగారావు శ్యమకూరి రాంబాబు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆర్జీయూకేటీ నూజివీడులో ఎంఎంఈ విద్యార్థులకు 'మెటా గేట్' శిక్షణ: రెండో ఎమ్ఓయూ ఖరారు

**ఆర్జీయూకేటీ నూజివీడు,జూలై 11 (వార్తాప్రభ) :** రాజీవ్ గాంధీ నాలెడ్జ్ టెక్నాలజీస్ విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) నూజివీడు క్యాంపస్‌లో మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ (ఎంఎంఈ) విభాగ విద్యార్థుల కోసం ప్రముఖ కోచింగ్ సంస్థ 'మెటా గేట్' ఆధ్వర్యంలో ప్రత్యేక గేట్ (ఉచిత) శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు.దీనికి గేట్ మెటలర్జీ అకడమిక్ హెడ్ శుభ్రదీప్ పాల్ హాజరయ్యారు. విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో రాణించి, ఉన్నత విద్యా రంగంలో అద్భుతమైన అవకాశాలను అందుకోవడమే లక్ష్యంగా హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటేటివ్ ఎగ్జామ్స్ సెల్ (ఎజు జజు జవశ్రీశ్రీ) ద్వారా విశ్వవిద్యాలయ పరిపాలనా విభాగం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య మద్దాలి లక్ష్మీనారాయణ రావు, రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, పరిపాలనాధికారి డా. బి. లక్ష్మణరావు, ఎంఎంఈ విభాగపు హెచ్ఓడీ వెంకటేశ్వర్లు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించి, విద్యార్థులకు అవసరమైన దిశానిర్దేశం చేశారు. ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా ఎంఎంఈ విద్యార్థులకు అత్యంత క్రమబద్ధమైన ప్రణాళికతో కూడిన కోచింగ్ మరియు పరీక్షా ప్రిపరేషన్ మార్గదర్శకాలను నిపుణులు అందించారు. అంతేకాకుండా, గేట్ పరీక్ష ద్వారా జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక విద్యా సంస్థల్లో లభించే ఉన్నత విద్యా సదుపాయాలు, పరిశోధనా అవకాశాలపై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించారు. ఈ శిక్షణ విద్యార్థుల్లో సన్నద్ధతను, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడింది.



**పీయూసీ విద్యార్థుల కోసం రెండో 'ఎమ్ఓయూ' (వీశీఖ):** ఇదే తరుణంలో, పీయూసీ విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా విశ్వవిద్యాలయం మరో కీలక అడుగు వేసింది. విద్యార్థులకు ప్రారంభ దశలోనే సబ్జెక్టులపై గట్టి పట్టు సాధించేందుకు వీలుగా 'మెటా గేట్ (బ్రిడ్జ్ కోర్స్)' నిర్వహణ కొరకు సదరు సంస్థతో రెండో అవగాహన ఒప్పందం (ఎమ్ఓయూ) కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు బలమైన పునాది కాగలదని విశ్వవిద్యాలయ అధికారులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ అకడమిక్ డీన్ దువ్వూరి శ్రావణి, ఈఐటిపి డీన్ శ్యామ్, సెంట్రల్ ఫైనాన్స్ ఆఫీసర్ డా. నాగార్జున దేవి, ఎం.ఎం.ఈ శాఖాధిపతి వీరశ్రీను, హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ కాంపిటేటివ్ సెల్ కోఆర్డినేటర్ డా.రామకృష్ణ, డా. వెంకటేశ్వర్లు తదితర అధ్యాపకులు పాల్గొన్నారు

## డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభం



**కోడూరు,జూలై 11 (వార్తాప్రభ) :** కోడూరు లోని నాయుడుపేట వంతెన సెంటర్ నుంచి ప్రారంభమై ఉల్లిపాలెం వరకు ఉన్న ప్రధాన డ్రైనేజ్ పూడికతీత పనులను శనివారం ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరావు ప్రారంభించారు. ఆపరేషన్ మెయింటెనెన్స్ క్రింద 5 లక్షల రూపాయలతో ఈ పనులు ప్రారంభించినట్లు డ్రైనేజీ డిఈ బాబు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా పిసి చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతి పనిని సమర్థవంతంగా నిర్వహిస్తుందని కోడూరు ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతూ రోగాల బారిన పడకుండా ఉండాలనే సదుద్దేశంతో 5 లక్షల రూపాయలు నిధులు కేటాయించి డ్రైనేజీ పూడికతీత పనులను వేగవంతంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, బడే భవన్నారాయణ, పిఎసిఎస్ చైర్మన్లు మర్రే గంగయ్య, పూతబోయిన కరుణ కుమార్, కోట సుబ్బారావు, డ్రైనేజీ ఎఇ కరీమ్, జనసేన పార్టీ నాయకులు జరుగు ఆదినారాయణ, కోట రాంబాబు, పూతబోయిన సీతారత్న సాయిబాబు , బచ్చు వెంకటేష్, అప్పికట్ల వినోద్, కాగిత రామారావు, తదితరులు పాల్గొన్నారు.




ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలం, చంద్రగూడెం గ్రామపంచాయతీ శివారు సజ్జపాడు గ్రామంలో మంచినీటి ఎద్దడిని నివారించేందుకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదేశాల మేరకు కూటమి నాయకులు మరియు గ్రామ ప్రజలు సమక్షంలో శనివారం బోరు వేశారు. గ్రామంలో మరి కొన్ని సమస్యలు ఉన్నాయని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి ఆ సమస్యలు కూడా పరిష్కరించేందుకు కృషి చేస్తామని చంద్రగూడెం పిఎసిఎస్ చైర్మన్ మొర్ల వెంకట రోశాలు,అలాగే జనసేన పార్టీ నాయకు లు కడియం బాలరాజు లు తెలియజేశారు.

–మైలవరం,జూలై 11 (వార్తాప్రభ) :

## కోడూరు ప్రధాన డ్రైనేజీ పూడికతీత పనులు ప్రారంభం



### రూ.5 లక్షలతో 5 కి.మీ మేర పనులు

**కోడూరు,జూలై 11 (వార్తాప్రభ) :** కోడూరు ప్రధాన పంట కాలువ వద్ద నుండి కోడూరు అవుట్ పాల్స్ స్లూయిజ్ వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఉన్న ప్రధాన డ్రైనేజీని రూ.5 లక్షల వ్యయంతో పూడికతీత చేస్తున్నట్లు డ్రైనేజీ డీఈ బాబు నాయక్ తెలిపారు. డ్రైనేజీలో పేరుకుపోయిన మట్టి, గడ్డి, చెత్తను తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. నీటి సంఘాల సహకారంతో ఈ పనులను చేపట్టి నట్లు పీసీ చైర్మన్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు ఇజ్జినేని శివాజీ, మర్రె గంగయ్య, కోట రాంబాబు, కాగిత రామారావు, బచ్చు వెంకటేష్, బడే భావన్నారాయణ, పుతబోయిన కరుణ కుమార్ తదితర జనసేన నాయకులు పాల్గొన్నారు.

# రోడ్డు కబ్జాపై ఎమ్మెల్యేకు వినతి!!

**పద్మావతి కాలనీ సమస్యపై తక్షణ స్పందన**
**రోడ్డు ఆక్రమణల తొలగింపునకు ఆదేశాలు**
**కాలనీ ప్రజల్లో కొత్త ఆశలు**
**సమస్య పరిష్కారానికి తొలి అడుగు**
**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన అధ్యక్షులు నాగండ్ల రవికుమార్**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 11 (వార్తాప్రభ):**పద్మావతి కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న రోడ్డు కబ్జా సమస్యకు పరిష్కారం దిశగా ఆశాజనక పరిణామం చోటుచేసుకుంది. కాలనీలో 49వ డివిజన్ కార్పొరేటర్ సాగి సంతోష్ రావు అపార్ట్మెంట్ సమీపం నుంచి ఉంజిల్ వేణుమాధవ్ నివాసం వరకు ఉన్న రోడ్డును కబ్జా చేయడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని పద్మావతి కాలనీ డెవలప్మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు నాగండ్ల రవికుమార్ ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను వివరించిన వెంటనే ఎమ్మెల్యే స్పందించిన తీరు కాలనీ ప్రజల్లో కొత్త ఆశలను నింపింది. ఆలస్యం చేయకుండా మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారికి ఫోన్ చేసి వెంటనే పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించడం ప్రజాప్రతినిధిగా ఆయన బాధ్యతాయుత వైఖరికి నిదర్శనంగా నిలిచింది. ఎన్నోసార్లు వినిపించినా పరిష్కారం కాని సమస్యపై ఈసారి సానుకూల స్పందన రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల కష్టాలను తమ కష్టాలుగా భావించి స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీ ప్రజలు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే దృష్టికి సమర్థంగా తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించిన కార్పొరేటర్ సాగి సంతోష్ రావు, పద్మావతి కాలనీ అధ్యక్షులు నాగండ్ల రవికుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాలనీ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా అందరూ ఒక్కటై ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం తమ విలువైన సమయాన్ని వెచ్చించి వెంట వచ్చిన కాలనీ పెద్దలు, మహిళలు, యువకులు, సభ్యులు చూపిన ఐక్యత కాలనీ భవిష్యత్తుకు బలమైన పునాది అని అభిప్రాయపడ్డారు. అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకుని రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. సమస్య పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవికుమార్ నాగండ్ల, జనరల్ సెక్రటరీ రాచర్ల శ్రీనివాస్ తెలిపారు.

# శిల్ప రామం లో ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రేక్షకులను అలరించిన భరతనాట్యం, కూచిపూడి నృత్య ప్రదర్శనలు**





**శేరిలింగంపల్లి,జూలై 11 (వార్తాప్రభ):**మాదాపూర్ శిల్పారామం లో నిర్వహిస్తున్న వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం భరతనాట్యం,కూచిపూడి నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.బెంగళూరుకు చెందిన భరతనాట్య కళాకారిణి సంజన గోగేట్ తోడి సొరకట్టు,భజరే మానస,తుమక చలత్ భజన్,తిల్లాన,అన్నమాచార్య కృతులను ప్రదర్శించి మెప్పించారు .అనంతరం భారతీయ కళాక్షేత్రం ఆధ్వర్యంలో గురువు శ్రీనివాస్ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలు అందించింది.తాండవ నృత్యం, భామాకలాపం, హనుమాన్ చాలీసా,అయిగిరి నందిని,దశావతారం తదితర అంశాలను తేజశ్రీ, శిరీష,ప్రణీత, గీతామృత,కుముద,సమన్విత, ఐశ్వర్య,శాన్వి తదితరులు ప్రదర్శించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారు.

# బిఎల్ఓ లు ఇంటింటికి తిరిగి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ వేగవంతం చేయండి

**-జోనల్ కమిషనర్ నారాయణ అమిత్**



**శేరిలింగంపల్లి,జూలై 11 (వార్తాప్రభ):**52 అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల నమోదు అధికారి (ఈఆర్ఓ), సీఎంసీ శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ పాటిల్ మియాపూర్‌లోని ఎం.ఏ.నగర్‌లో బీఎల్ఓల పనితీరును పరిశీలించారు. సహాయ ఎన్నికల నమోదు అధికారి, నోడల్ అధికారి, బీఎల్ఓ సూపర్వైజర్లతో కలిసి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియ పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల సేకరణను వేగవంతం చేయడంతో పాటు నిర్ణీత గడువులోగా డిజిటైజేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక సత్వర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా అర్హులైన పౌరులు తమ ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూర్తిగా నింపి బీఎల్ఓలకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో ఎన్నికల నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుంచి పేరు తొలగించే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

# హైదరాబాద్ కు గుజరాత్ యాదవ సంఘం అధ్యక్షులు విజయభాయి వాంక్ రాక





**ఘన స్వాగతం పలికిన అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ నాయకులు.**

**హైదరాబాద్,** జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి): అఖిల భారత యాదవ మహాసభ గుజరాత్ రాష్ట్ర అధ్యక్షులు విజయ్ భాయ్ వాంక్ యాదవ్ తమ మిత్ర బృందంతో కలిసి హైదరాబాద్‌కు విచ్చేశారు.ఈ సందర్భంగా బీజేపీ మాజీ జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ గౌంటి శంకర్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. మల్లేష్ యాదవ్ , రాష్ట్ర కోశాధికారి దారబోయిన శ్రీనివాస్ యాదవ్,అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర యువజన అధ్యక్షులు గొర్ల యశ్వంత్ రాజ్ యాదవ్ లు విజయ్ భాయ్ వాంక్ యాదవ్ గారిని ఘనంగా శాలువా కప్పి సన్మానించారు.ఈ సందర్భంగా సంస్థ బలోపేతం, యాదవ సమాజ ఐక్యత, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు పరస్పరం చర్చించి, దేశవ్యాప్తంగా యాదవ సమాజ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని సంకల్పించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి రాజబోయిన సంతోష్ యాదవ్ , జెల్ల శ్యామ్ యాదవ్ గారు, గబ్బర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టుల ద్వారా డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటాన్ని అడ్డుకోలేరు

**- దమ్మాయిగూడ జేఏసీ చేపట్టిన లారీల బంద్ కార్యక్రమాన్ని విచ్చినం చేయడం అప్రజాస్వామికం అని ప్రకటించిన జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటి చైర్మన్ షేక్ షావలి, కన్వీనర్ ఉమామహేష్**





**జవహర్ నగర్, జూలై 11:(వార్తా ప్రభ)**అర్ధరాత్రి అక్రమ అరెస్టులను ఖండిస్తూ బాలాజీనగర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్ రామ్ విగ్రహాల ముందు నిరసన కార్యక్రమం.మాటతప్పిన రాష్ట్ర ప్రభుత్వం.భవిష్యత్తులో డంపింగ్ యార్డు తొలగింపుకై ప్రజా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని స్పష్టం చేసిన పోరాటకమిటి.గత మేనెలలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం రాంకి చెత్త డంపింగ్ యార్డ్ తొలగింపుకు శాశ్వత పరిష్కారం చూపుతామని చెప్పి, రెండు నెలలుగా జరుగుతున్న కాలయాపన్ని, నిర్లక్ష్యాన్ని తీవ్రంగా నిరసిస్తూ యాంటి దమ్మాయిగూడ జేఏసీ జూలై-11, శనివారం రోజు చేపట్టిన చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ పోలీసులు బగ్నం చేయడాన్ని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి తీవ్రంగా ఖండిస్తూ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. 2026, జూలై-11 న, స్థానిక కీసర సర్కిల్, జవహర్ జీహెచ్ఎంసీ పరిధిలో గల బాలాజీనగర్ డాక్టర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాల ముందు జరిగిన కార్యక్రమంలో డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి నాయకులను అర్ధరాత్రి తెల్లవారుజామున అక్రమ అరెస్టులకు గురిచేయడాన్ని తీవ్రంగా ఖండించారు. జవహర్ నగర్ డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాలలోని నాలుగు మండలాల ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపుకు ప్రజాస్వామ్య పద్ధతిలో, శాంతియుతంగా నిరసన కార్యకలాపాలు చేస్తున్న వారిపై, నిర్భంధ చర్యలకు గురిచేయడం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికే చెల్లిందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య భద్రత, జీవించేహక్కుకై ప్రజా ఉద్యమకారులపై ఇలాంటి చర్యలు అమానుషం, అప్రజాస్వామికం అని అన్నారు. ఒకవైపు శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టవచ్చునని పోలీసు అధికారులే ప్రకటనలు చేస్తున్నారని, మరోవైపు ప్రజలను, పోరాటకమిటిలోని బాగస్వామ్య సంస్థల సభ్యులను తీవ్ర భయాందోళనలకు గురిచేసేలా అర్ధరాత్రి నిద్రలో ఉన్నవారిని బలవంతంగా పోలీసు వాహానాల్లో బొల్లారం, అమీర్ పేట, శామీర్ పేట పోలీసు స్టేషన్లకు తరలించడం ద్వారా డంపింగ్ యార్డు వ్యతిరేక పోరాటాన్ని అడ్డుకోలేరని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉధృతంగా ప్రజా పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన మాట తప్పిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం, వెంటనే ప్రజలపట్ల అనుసరిస్తున్న అన్నిరకాల మోసపూరితమైన విధానాలకు స్వస్తిపలకాలని హితువు పలికారు. తమ మొండి వైఖరిని విడనాడి, శాస్త్రవేత్తల సూచనలను ననుసరించి, డంపింగ్ యార్డు తొలగింపుకు యుద్ధ ప్రాతిపదికన తగిన చర్యలు చేపట్టి, అక్రమంగా అరెస్టు చేసిన బీఆర్ఎస్ బాషవోని కొండల్ ముదిరాజ్, టిఆర్ఎస్(జాగృతి) మేక లలిత యాదవ్, ప్రగతి నగర్ నరేందర్, అహ్మద్ గూడ ఆర్జీ కాలనీకి చెందిన కాంగ్రెస్ ఈగరాజు ముదిరాజ్, పోతరాజు, రాములు, మహ్మద్ ముబారక్, బీఆర్ఎస్ ముద్దసాని నరేష్, డబుల్ బెడ్ రూమ్ కాలనీ, ఫేజ్-1 ఎం.శ్రీహరి గౌడ్, జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధి దొంతగాని కోటేష్ గౌడ్ మరియు తదితర సుమారు 200 మందిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పోరాట కమిటీ కన్వీనర్ మరియు సిపిఐ ఉమామహేష్, మాజీ ఉపసర్పంచ్, గౌరవ సలహదారుడు ఆర్. నర్సింహ్మ గౌడ్, సిపిఎం టి.శివన్నారాయణ, సిపిఐ(ఎం.ఎల్) న్యూడెమోక్రసీ అనురాధ, సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గద్దం సదానందం, సిపిఐ టి.శంకర్, సిఎంఎస్ జయ, పిడిఎం చంద్రమౌళి, ఐ.ఎఫ్.టి.యు.పి శివబాబు, పిఓడబ్ల్యూ డి.స్వరూప, టియుజేఏసి కల్లెపు చర్చల చంద్రన్న ప్రసాద్, బి.ఎన్.ఆర్.కె.ఎస్. కామెళ్ళ అయిలయ్య, పిఓడబ్ల్యూ (విముక్తి) పెర్క సునిత, పిఓడబ్ల్యూ జయసుధ, సిఎంఎస్ అల్లూరి సావిత్రి, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ టి.కాలేషా, ఆమ్ ఆద్మీ పార్టీ మోఇన్, ఫాతిమా, కల్లెపు నర్సయ్య, లక్ష్మీ బాయ్, లలిత, సైయద్ ముబషీర్ అబ్బు, జర్నలిస్ట్ కొన్నెవేణు, సూర వెంకన్న, ఎం.డి.షఫి, వహీద్, సైయద్ గౌస్, షేక్ యాకుబ్ తదితర జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటిలోని బాగస్వామ్య సంస్థలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. అనంతరం బొల్లారం పోలీస్ స్టేషనుకు వెళ్ళి, అరెస్ట్ అయిన కొండల్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి, హరిగౌడ్, రమేష్ గౌడ్ లను కలువడం జరిగింది.

# వార్త్తాప్రభ ఎఫెక్ట్

**● నారాయణ పాఠశాలకు షోకాజ్ నోటీసులు!! ● రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలి ● ప్రభుత్వ నిబంధనల ఉల్లంఘన ● ప్రైవేట్ స్కూల్‌పై ఎంఈవో చర్యలు ● పుస్తకాల విక్రయంపై కఠిన హెచ్చరిక ● గుర్తింపు రద్దుకు డిఈఓకు సిఫారసు**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 11 (వార్తాప్రభ):**రామగుండం పరిధిలోని నారాయణ పాఠశాలకు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించిన నేపథ్యంలో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి (ఎంఈవో) జింక మల్లేష్ తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, ఇతర విద్యా సామగ్రిని బలవంతంగా విక్రయించడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో నారాయణ పాఠశాలలో ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా పుస్తకాల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. శుక్రవారం రోజు ఒక అపార్ట్మెంట్ లో పుస్తకాలు స్లాట్ చేయడంపై వచ్చిన కథనాల నేపథ్యంలో వెంటనే పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, రెండు రోజులలోపు పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని ఆదేశించినట్లు చెప్పారు. యాజమాన్యం ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోయినా, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయినా పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)కు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఏ ప్రైవేట్ పాఠశాల కూడా తమ ప్రాంగణంలో పుస్తకాలు, యూనిఫాంలు లేదా ఇతర వస్తువులను విక్రయించకూడదని ఆయన స్పష్టం చేశారు. తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపే విధంగా వ్యవహరించడం సహించబోమన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు తమకు ఎదురయ్యే ఇలాంటి సమస్యలను విద్యాశాఖ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా అమలు చేయాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి పాఠశాల ప్రభుత్వ నిబంధనలకు లోబడి పనిచేయాల్సిన బాధ్యత ఉందని ఎంఈవో జింక మల్లేష్ పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమాలను ఉల్లంఘించే విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

# ముఖ్యమంత్రి పర్యటనను అధికార్లు సమన్వయంతో పనిచేసి విజయవంతం చెయ్యాలి

**వివిధ శాఖలు అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**



**ఏలూరు, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను త్వరితగతిన పూర్తిచెయ్యాలని జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. పోలవరం మండలం పోలవరం ప్రాజెక్టులో శనివారం హెలిప్యాడ్ ప్రాంతాన్ని, ఇసిఆర్ డ్యామ్ గ్యాప్ 1, 2, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు ( పవరు హౌసు), తదితర ముఖ్యమంత్రి పరిశీలించే ప్రాజెక్టు పనులను నిశితంగా పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై పోలవరం జిల్లా కలెక్టరు కె.దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్, ముఖ్యమంత్రి భద్రతా అధికారులు, జిల్లా జాయింటు కలెక్టరు యం.జె.అభిషేక్ గౌడలతో కలిసి జిల్లా అధికారులతో సమావేశ మందిరంలో జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి అధ్యక్షతన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ నెల 13వ తేదీ (సోమవారం ) ఉదయం తూర్పుగోదావరి ధవళేశ్వరం గేట్లు ప్రారంభోత్సవ పర్యటన చూసుకుని, మధ్యాహ్నం పోలవరం మండలం పోలవరం ప్రాజెక్టు పనులు ఏరియల్ సర్వేచేసి, హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం 12.55 ని. లకు విచేస్తారన్నారు. ఇసిఆర్ డ్యామ్ గ్యాప్ -1, 2, పోలవరం హైడ్రో ఎలక్ట్రికల్ ప్రాజెక్టు ( పవరు హౌసు), తదితర ప్రాజెక్టు పనులను బస్సులో ప్రయానిస్తూ, ఇంజనీరింగు బృందంతో మాట్లాడుతూ, ఫోటో ఎగ్జిబిషన్ ను, ఇందుకు సంబంధించిన మ్యాపులను ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలిస్తారన్నారు.

**వార్తా ప్రభ**

# హైదరాబాద్

# అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాన్ని అణచలేరు.

**సీపీఎం జవహర్‌నగర్ కార్యదర్శి శివనారాయణ.**
**ముందస్తు నోటీసు ఇవ్వకుండా అరెస్ట్ చేయడం అక్రమం.**



**జవహర్ నగర్, జూలై 11:(వార్తా ప్రభ)**డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ (జేఏసీ) నాయకులను ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా తెల్లవారుజామున అరెస్టు చేయడాన్ని సీపీఎం జవహర్‌నగర్ కార్యదర్శి శివనారాయణ తీవ్రంగా ఖండించారు. రాంకీ చెత్త డంపింగ్ యార్డును తొలగించేందుకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రభుత్వం హామీ ఇచ్చి రెండు నెలలు గడిచినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. ఈ నేపథ్యంలో శనివారం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన చెత్త లారీల బంద్ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేశారని ఆరోపించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న రాంకీ చెత్త డంపింగ్ యార్డు తొలగింపు కోసం ప్రజాస్వామ్యబద్ధంగా, శాంతియుతంగా ఆందోళనలు చేస్తున్న వారిపై నిర్బంధ చర్యలు చేపట్టడం తగదన్నారు. ఒకవైపు శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా నిరసన కార్యక్రమాలు నిర్వహించవచ్చని పోలీసు అధికారులు ప్రకటిస్తుండగా, మరోవైపు ప్రజలను, పోరాట కమిటీ సభ్యులను భయాందోళనలకు గురిచేసే విధంగా నిద్రలో ఉన్న వారిని బలవంతంగా పోలీసు వాహనాల్లో బొల్లారం, అమీర్‌పేట్, శామీర్‌పేట్, జవహర్‌నగర్ పోలీసు స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామ్య విరుద్ధమని అన్నారు. అక్రమ అరెస్టుల ద్వారా డంపింగ్ యార్డు వ్యతిరేక ప్రజా ఉద్యమాన్ని అడ్డుకోలేరని స్పష్టం చేసిన శివనారాయణ, అవసరమైతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ప్రజా పోరాటాలను కొనసాగిస్తామని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన సుమారు 200 మందిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ప్రజలు,యువత, సంక్షేమ,కాలనీ సంస్థలు......

**ఎస్.ఐ.ఆర్. కార్యక్రమం లో భాగస్వాములు అయ్యి ఓటరు నమోదు విజయవంతం చేయండి.**
**కాంగ్రెస్ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్ తో కలిసి ఎస్.ఐ.ఆర్. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన ఎమ్మెల్యే గాంధీ.**





**శేరిలింగంపల్లి,జూలై 11 (వార్తాప్రభ):**చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంట కాలనీలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ,సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ జూలై 24లోపు ప్రతి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి వివరాలతో నింపి సంతకం చేసి బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు.ఫారం సమర్పించిన వారికి మాత్రమే ఓటు హక్కు కొనసాగుతుందని ,తప్పనిసరిగా అక్‌నాలెడ్జ్‌మెంట్ రసీదు తీసుకోవాలని తెలిపారు.ప్రజలు, యువత,కాలనీ సంక్షేమ సంఘాలు,స్వచ్ఛంద సంస్థలు ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగస్వాములై ఓటరు నమోదు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ వహీద్ అలీ,బీఎల్‌వోలు,నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ఆకట్టుకున్న భవానీస్ నృత్యాంజలి కళాక్షేత్రం శిష్యుల నృత్య ప్రదర్శన



**శేరిలింగంపల్లి,జూలై 11 (వార్తాప్రభ):**అన్నమయ్యపురంలో పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం--అన్నమ స్వరార్చన కార్యక్రమంలో భాగంగా భవానీస్ నృత్యాంజలి కళాక్షేత్రం శిష్యులు ఆకట్టుకునే నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.తొండపు భవాని మార్గదర్శకత్వంలో శిష్యులు శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వర స్వామికి అంకితంగా పుష్పాంజలి, బ్రహ్మాంజలి,దశావతారం, జతీశ్వరం,నారాయణతే, వినాయక కౌత్వం తదితర నృత్యాంశాలను ప్రదర్శించి భక్తులను అలరించారు.ఈ సందర్భంగా పద్మశ్రీ డా. శోభారాజు అన్నమాచార్య సంకీర్తనకు భావార్థ వివరణ అందించడంతో పాటు గురువు భవాని సేవలను అభినందించారు.అనంతరం పాల్గొన్న కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.ఈ కార్యక్రమం మంగళహారతి, ప్రసాద వితరణతో ముగిసింది.

# సంపాదకీయం

## జమిలి ఖాయం... సీట్ల పెంపు కంఫర్మ్ ?

దేశంలో 2029 ఎన్నికలు కొత్తగా ఉండబోతున్నాయా అంటే అవును అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. జమిలి ఎన్నికలు ఖాయం అని అంటున్నారు. ఈ విషయం రాజకీయ వర్గాలలో చర్చగా ఉన్నా తాజాగా తెలంగాణా కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దీనిని బలాన్ని ఇస్తున్నాయి. ఆయన ఖమ్మంలో జరిగిన సభలో మాట్లాడుతూ 2028లో ఎన్నికలు కాదు 2029లోనే తెలంగాణాలో ఎన్నికలు ఉంటాయని చెప్పారు. ఒక విధంగా ఇది సంచలన ప్రకటన గానే చూడాలి. అయితే ఇదే మాటను రేవంత్ రెడ్డి గతంలో కూడా అన్నారు. మరి ఆయన ఇంతలా గట్టిగా చెప్పగలుతున్నారు అంటే జమిలి ఎన్నికలకు దేశంలో సన్నాహాలు జరుగుతున్నట్లుగా జాతీయ పార్టీగా ఉన్న కాంగ్రెస్ కి సమాచారం అందే ఉంటుందని భావిస్తున్నారు. జమిలి ఎన్నికలకు బీజేపీ కూడా తొందరపడుతోంది. దానికి ఆ పార్టీ అనుసరిస్తున్న వైఖరి కూడా కారణంగా ఉంది. లోక్ సభ సీట్లను 824 దాకా పెంచాలనుకోవడం, మహిళా బిల్లుని 2029 ఎన్నికల నుంచి వర్తింపచేయాలనుకోవడం ఈ విషయంలో పట్టుదలగా బీజేపీ రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదం కోసం చేస్తున్న ప్రయత్నాలు చూస్తే కనుక దేశంలో రాజకీయం 2029 నాటికి మారుతుందని అంటున్నారు. అంతే కాదు జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ నాయకత్వంలో గతంలో వేసిన కమిటీ ఇచ్చిన సిఫార్సులు కేంద్రం వద్ద ఉన్నాయి. అనుకుంటే బీజేపీ దీని మీద కూడా పార్లమెంట్ లో బిల్లు పెడుతుందని అంటున్నారు. ఇపుడు బిల్లు పెట్టి ఆమోదిస్తే కనుక 2029 నాటికి కచ్చితంగా ఎన్నికలు జరుగుతాయని దానికి కావాల్సినంత సమయం ఉండాలంటే వర్షాకాల సమావేశాలోనే జమిలి ఎన్నికల బిల్లు ఆమోదిస్తారు అని అంటున్నారు. ఈ రాష్ట్రాలు అన్నీ లిస్టులో : ఇక జమిలి ఎన్నికలు అంటే కొన్ని చోట్ల ఎన్నికలను వెనక్కి తీసుకెళ్ళాలి. కొన్ని చోట్ల ముందుకు తీసుకుని రావాలి. రాజ్యాంగంలో ఉన్న ప్రకారం కనీసం ఏడాది లోపు ఉండే ఎన్నికలను ముందుకైన వెనక్కి అయినా జరుపుకోవచ్చు. ఈ లెక్క చూస్తే కనుక 2028 రెండవ అర్ధ భాగంలో జరిగే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలను అలాగే 2030 తొలిభాగంలో జరిగే అసెంబ్లీ ఎన్నికలను కూడా 2029 జూన్ ఎన్నికలకు తీసుకుని వచ్చి జమిలి గా జరిపించవచ్చు అని అంటున్నారు. ప్రస్తుతం దేశంలో 28 రాష్ట్రాలు ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాలు ఉన్నాయి. దాంతో వీటిలో కనీసం సగానికి పైగా రాష్ట్రాలలో ఒకేసారి ఎన్నికలు నిర్వహించినా జమిలి ఎన్నికలకు దేశం సిద్ధమై ఆ వైపుగా నడిపించినట్లే అవుతుంది.జమిలి ఎన్నికల చట్రంలోకి : ఆ తరువాత వరసలో మిగిలిన రాష్ట్రాలను తీసుకుని వస్తే మరో ఎన్నికల నాటికి మొత్తం దేశమంతా ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన వాతావరణం ఏర్పడుతుందని భావిస్తున్నారు.

# షరతులు లేని మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి

● పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే మహిళా బిల్లును ఆమోదించాలి ● మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళల రక్తంతో మోదీకి లేఖలు ● మహిళలను వంచిస్తున్న ఎన్డీఏకు బుద్ధి చెబుతామని వనజ, దుర్గాభవానీ స్పష్టీకరణ





**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య నగర సమితి ఆధ్వర్యంలో నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ అధ్యక్షతన ఎటివంటి షరతులు లేకుండా ఈ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లోనే మహిళా బిల్లును ఆమోదించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గాభవానీ డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే పార్లమెంటులో ఆమోదించి, చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ప్రధాని మోదీకి మహిళలు రక్తంతో ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. విజయవాడ వన్ టౌన్ పోస్ట్ ఆఫీస్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో అక్కినేని వనజ, పి.దుర్గాభవానీ మాట్లాడుతూ 2006లో అప్పటి కమ్యూనిస్టు ఎంపీ గీతాముఖర్జీ నేతృత్వంలోని కమిటీ సిఫార్సుల మేరకు చట్టసభల్లో మహిళలకు 33 శాతం బిల్లును రూపొందించారని తెలిపారు. అప్పటి నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లు పెండింగ్ లో ఉందన్నారు. ఈ బిల్లును 2013 లో 106వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యసభలో ఆమోదించారని చెప్పారు. మనువాద భావజాలం కలిగిన బీజేపీ తొలి నుంచి మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. నియోజకవర్గాల పెంపు, డీలిమిటేషన్ కోసం ఇటీవల మోసపూరితంగా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారని చెప్పారు. మహిళల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే ఎటువంటి షరతులు లేకుండా 2013లో రూపొందించిన బిల్లును వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదించి, మహిళలకు 181 ఎంపీ సీట్లు ఇచ్చేలా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీతో సహా అన్ని రాష్ట్రాలు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. ఇందుకు విరుద్ధంగా మళ్లీ మహిళలను మోసం చేయాలని చూస్తే ప్రజాక్షేత్రంలో తగిన బుద్ధి చెబుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బంక ఝాన్సీ లక్ష్మి , నగర అధ్యక్షురాలు ఓర్సు భారతి, నగర నాయకులు నీలాపు భాగ్యలక్ష్మి, దర్శనం పుష్పవతి, ఏస్కె నాగర్ బీ,బి శాంత,ఆర్ ఉమ,సిహెచ్అనిత, షైనీ,కన్నమ్మ, సత్యవతి, తాడి శివ లీల కాకాని సరోజ, సుజాత, బొర్రా గుణసుందరి, కళ్యాణి, నాగలక్ష్మి,సోనీ,కె. కాంతమ్మ,జి.సింహాచలం, నరసయ్యమ్మ ,అచ్చియమ్మ,కాకాని ,సంధ్య కుమారి, కాకాని హారిక,బేగం,ఆర్.లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# "సుజన ఫౌండేషన్" ఉచిత వైద్య శిబిరం విజయవంతం..







**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆధ్వర్యంలోని "సుజన ఫౌండేషన్ " ద్వారా 35 వ డివిజన్ , పూర్ణానందంపేట , కౌతా సుబ్బారావు మున్సిపల్ స్కూల్లో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతమైంది.."సుజన ఫౌండేషన్" ద్వారా అనుభవజ్ఞులైన వైద్యులతో నిర్వహించిన ఈ శిబిరంలో బీపీ ,షుగర్ , డెంటల్,కంటి పరీక్షలు, ఈ సీ జీ , 2 డి ఎకో, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు..ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి నిపుణులైన వైద్యుల బృందం ప్రత్యేక శ్రద్ధతో చికిత్సలు అందించారు.దీనివల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు పెద్ద ఉపశమనం లభించింది.. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఎం ఎల్ ఏ సుజన చౌదరి ఆదేశాలతో "సుజన ఫౌండేషన్ " ద్వారా వారాంతంలో నిర్వహిస్తున్న ఈ మెగా వైద్య శిబిరాలను పేద మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కూటమి నేతలు ప్రదీప్ కుమార్ రాజ్, భూదాల నంద కుమారి , పైడి మాల సుభాషిణి కోరారు.. పీ వీ ఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, శంకర నేత్ర చికిత్సలయం వైద్యులు, గవర్నమెంట్ ఆస్పత్రి డెంటల్ డాక్టర్లు, సుజన ఫౌండేషన్ సిబ్బంది, సుజన మిత్రా కోఆర్డినేటర్లు ఈ శిబిరంలో తమ సేవలు అందించారు..

# విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)--2026 కార్యక్రమం పురోగతిపై విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి (ఈ ఆర్ ఓ) ధ్యానచంద్ర శనివారం ఉదయం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల జాబితాల రూపకల్పనలో పారదర్శకత, ఖచ్చితత్వం, నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని కమిషనర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, సెంట్రల్ నియోజకవర్గంలో ఎస్ఐఆర్--2026 ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా కొనసాగుతోందని తెలిపారు. ఎన్నికల జాబితాలో ఆబ్సెంట్ , మరణించిన , శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన , డూప్లికేట్ ఓటర్ల వివరాల పరిశీలనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ లెవల్ ఏజెంట్లు , ఏఈఆర్వోలతో సమన్వయం చేసుకుని సహకరించాలని కోరారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు నిబంధనల ప్రకారం తొలగించేలా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తున్నామని తెలిపారు. రాజకీయ పార్టీల నుంచి అందే సూచనలు, అభ్యంతరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి పారదర్శకతతో నిర్వహించేందుకు ప్రతి రాజకీయ పార్టీ చురుకుగా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎన్. నరసింహారావు (ఐ ఎన్ సి), ఎన్. వీరభద్రరావు (సీపీఐ), బి. రమణారావు సీపీఐ (ఎం), ఎన్. సాంబశివరావు (తెదేపా), జి. సుందర్ పాల్ (వైసీపీ), వంశీ కృష్ణ (జే ఎస్ పి) ఏఈఆర్వో ఽ చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్, ఏఈఆర్వో, అసిస్టెంట్ సిటీ ప్లానర్--2 వై. రాంబాబు, ఏఈఆర్వో, సూపరింటెండింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్) పి. సత్యకుమారి, ఏఈఆర్వో,జోనల్ కమిషనర్--2 కె. ప్రభుదాస్, ఏఈఆర్వో ఽ తహసీల్దార్ (విజయవాడ సెంట్రల్) వి. దివ్య, ఏఈఆర్వో ఽ తహసీల్దార్ (విజయవాడ నార్త్ మండలం) కె. లక్ష్మి, ఎలక్షన్ డి.టి ఎస్. సురేష్ కుమార్ పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాలు అందించేందుకు జూలై 14 చివరి తేదీ

**విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎన్ ఐ ఆర్--2026) కార్యక్రమంలో భాగంగా పంపిణీ చేసిన ఎన్యుమరేషన్ ఫారాలను సమర్పించడానికి జూలై 14, 2026 చివరి తేదీ అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు.ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారాలు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా వాటిని పూర్తిగా నింపి, సంబంధిత బూత్ లెవల్ ఆఫీసర్ కు లేదా సమీప బూత్ కేంద్రంలో జూలై 14వ తేదీలోపు సమర్పించాలని సూచించారు.ఇంకా ఫారం అందని వారు తమ పరిధిలోని బి ఎల్ ఓ ను లేదా సమీపంలోని ప్రత్యేక శిబిరాలు లేదా సచివాలయంలో సంప్రదించి వెంటనే ఫారం పొందాలని కోరారు. అదేవిధంగా, ఇంటి వద్దకు వచ్చిన బి ఎల్ ఓ లకు పూర్తిగా సహకరించి ఎన్యుమరేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.ప్రత్యేక సమగ్ర సవరణ--2026 కార్యక్రమం ద్వారా ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయడం, అర్హులైన ప్రతి ఓటరు పేరు ఓటర్ల జాబితాలో కొనసాగడం లక్ష్యమని తెలిపారు. అందువల్ల ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఓటరు జూలై 14వ తేదీలోగా తమ ఎన్యుమరేషన్ ఫారాన్ని సమర్పించాలని కమిషనర్ కోరారు.

# కాంట్రాక్ట్ కార్మికుల జేపీసీ గౌరవ అధ్యక్షుడిగా జంపాల సీతారామయ్య

**కార్మికుల పక్షపాతి ప్రభుత్వం ఇది జంపాల సీతారామయ్య**



**ఇబ్రహీంపట్నం, జులై 11(వార్తా ప్రభ ప్రతినిధి):**కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి అందరం చిత్తశుద్ధితో పని చేద్దామని, కాంటాక్ట్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం తీసుకువచ్చి పరిష్కరించుకుందామని, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని తెలిపారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య.డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి అన్ని కార్మిక సంఘాలు కలిసి యూనియన్లకు అతీతంగా జేపీసీగా ఏర్పడ్డాయి. ఈ జేపీసీ గౌరవ అధ్యక్షుడిగా కార్మిక పక్షపాతి,కార్మికులకు అండగా నిలిచిన వ్యక్తి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జంపాల సీతారామయ్య ను గౌరవ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కాంటాక్ట్ కార్మికుల సమస్యలు, పరిష్కారాల తో కూడిన వినతి పత్రాన్ని జంపాల సీతారామయ్య కు అందించారు.ఈ సందర్భంగా జంపాల సీతారామయ్య కార్మికులతో మాట్లాడుతూ గతంలో కూడా తెలుగుదేశం ప్రభుత్వం కాంటాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేసి వారి సమస్యలను పరిష్కరించిందని గుర్తు చేశారు. యూనియన్లకు అతీతంగా అందరూ కలిసికట్టుగా రావడం ఎంతో అభినందనీయమని, కార్మికుల సమస్యలను స్థానిక ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లి ఆయన ద్వారా ద్వారా ప్రభుత్వ పెద్దలు, ముఖ్యమంత్రి వద్దకు తీసుకు వెళ్లి తప్పకుండా వారికి న్యాయం చేసే విధంగా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ యూనియన్ల నాయకులు స్వతంత్ర కుమార్, దుర్గారావు, షరీఫ్, ప్రసాద్, పవన్ కుమార్, మహేష్, మురళి, శేఖర్ రెడ్డి, పురుషోత్తం,బాబి, సురేష్ కుమార్, మల్లికార్జునరావు, శాంతి కుమార్, సంషేర్ వలి, దుర్గారావు, కార్మికులు పాల్గొన్నారు.

# పాత రాజరాజేశ్వరి పేట ఇళ్ల పట్టాల పరిష్కారం కోసం చేస్తున్న నిరసన

**లో పాల్గొని మద్దతు తెలియజేసిన పోతిన వెంకట మహేష్**





**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గుంటూరు పార్లమెంట్ వైసీపీ పరిశీలకులు పోతిన మహేష్ పాత రాజ రాజేశ్వరి పేట ఇళ్ల పట్టాలసమస్యకి పరిష్కారం ఎప్పుడు చూపిస్తారని స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి ని, ఎంపీ కేశినేని శివనాథ్ ని డిమాండ్ చేశారు.బుడమేరు అన్నా 30 రోజులకు శాంతించి ఈ ప్రాంత ప్రజల్ని బయటవేసింది గానీ కూటమి ప్రజాప్రతినిధులు వీరి జీవితాల్ని ఇబ్బంది పెడుతున్నా, రైల్వే శాఖ పదే పదే నోటీసులు ఇస్తున్న కూటమి నాయకులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.1000 కి పైగా కుటుంబాలు, 4000 మంది కి పైగా ప్రజలు, 50 సంవత్సరాలుగా స్తిర నివాస ఉంటున్న ఎందుకు వీరికి శాశ్వత పరిష్కారం చూపించలేకపోతున్నారు అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్న.ఎందుకు పాత రాజా రాజేశ్వరి పేట పేద ప్రజలు పై రైల్వే శాఖకు అంత కక్ష.ఇక్కడ ఏమైనా అభివృద్ధి కార్యక్రమాలుకు బ్లూ ప్రింట్ తయారయ్యిందా ,ఇక్కడకొత్త రైల్వే లైన్ లు నిర్మాణం లేకున్నా ఎందుకు పాత రాజరాజేశ్వరి పేట వాసులకు పదేపదే నోటీసులు ఇస్తు ఎందుకు భయభ్రాంతులకు గురి చేస్తున్నారో రైల్వే అధికారులు సమాధానం చెప్పాలన్నారు. రైల్వే శాఖ వారు ప్రత్యన్నాయ స్థలం రాష్ట్ర ప్రభుత్వాన్ని అడిగి తీసుకోవచ్చు తద్వారా మీ కొత్త ఆఫీస్లు ఏవైనా నిర్మాణం చేసుకోవాలంటే ఆ ప్రాంతానికి వెళ్ళ వచ్చు గతంలో కూడా జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో నోటీస్ లు ఇస్తే ఆ రోజు కూడా తాను ప్రతిపక్షంలో ఉన్న బలంగా పాత రాజరాజేశ్వరి పేట వాసులతో కలిసి పోరాటం చేశా. ఆరోజు కూడా జగన్ మోహన్ రెడ్డి కూడా రైల్వే వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపిస్తే మాకు ఆ స్థలం సరిపోలేదని సాకులు చూపించి ఎందుకు ఈ సమస్యని కొనసాగిస్తున్నారని మేము రైల్వే అధికారులను సూటిగా ప్రశ్నిస్తున్నామని పోతిన అన్నారు.కావాలనే రైల్వే అధికారులు పాత రాజా రాజేశ్వరి పేట ప్రజల మీద కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారు.తాము రేపు సోమవారం ఈ సమస్య మీద రైల్వే డి ఆర్ ఎమ్ తో మాట్లాతామన్నారు.రైల్వే వారు కచ్చితంగా ప్రత్యామ్నాయ స్థలం తీసుకోవాలి ఆర్ ఆర్ పేట వాసులకు శాశ్విత పరిష్కారం చూపాలి. తాను ఎమ్మెల్యే కాలేకపోయాను , నేనే ఎమ్మెల్యే అయితే ఈ సమస్య కు సునాయాసంగా నేనే పరిష్కారం చూపించే వాడినని ఆయన అన్నారు. స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి వచ్చి ఈ ప్రాంత ప్రజలకు సమస్యపై ఒక అరగంట సమయం కేటాయించ లేకపోతున్నారా, మీకు ఓట్లు వేసిన పాపానికి పశ్చిమ నియోజకవర్గం ప్రజలు రోడ్లమీద నిలబడాలా సుజనా చౌదరి అంటూ ప్రశ్నించారు.గత సంవత్సరం కూడా ఎంపీ కేసినేని చిన్ని వచ్చి ఈ సమస్యకు పరిష్కారం చూపిస్తాం అని మాట్లాడి వెళ్లారు. ఎంపీ చిత్త శుద్ధి తో పని చేస్తే మీ స్థాయిలో ఈ సమస్యకు పరిష్కారం చూపించగలుగుతారు ఆర్టీసీ స్థలాన్ని లులు మాల్ కి వ్యాపారం చేసుకోవడానికి ఇవ్వడానికి చూపించిన శ్రద్ధ, ఎయిర్ పోర్ట్ ల దగ్గర అధికారులతో మాట్లాడడానికి చూపించిన శ్రద్ధ, క్రికెట్ స్టేడియాలపై చూపించిన శ్రద్ధ, పాత రాజరాజేశ్వరి పేట వాసుల మీద కూడా చూపిస్తే ఈ సమస్య చాలా చిన్నది పరిష్కారం అయిపోతుందని కూడా కేశినేని శివనాథ్ కి విజ్ఞప్తి చేస్తున్న అని మహేష్ అన్నారు.కచ్చితంగా వీరి సమస్యకి శాశ్వత పరిష్కారం చూపించాలి లేనిపక్షంలో మా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాండు ,జాఫర్ , షాహీనా ,ఖుర్షిదా తమ్మారావు మరియు పాత రాజరాజేశ్వరి పేట వాసులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని కుదిపేసిన మెడికోల సమరం...

**ఫైనల్‌లో ఎస్‌వీ మెడికల్ కాలేజీ ఘన విజయం**



**తిరుపతి, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఎస్వీ వైద్య కళాశాల మైదానంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వైద్య, దంత వైద్య కళాశాలల విద్యార్థుల క్రికెట్ టోర్నమెంట్‌లో ఎస్వీ వైద్య కళాశాల జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. ఐదు రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌కు రాష్ట్రంలోని వివిధ వైద్య, దంత వైద్య కళాశాలలకు చెందిన 48 జట్లు హాజరై తమ ప్రతిభను చాటాయి.జూలై 7న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ పి. చంద్రశేఖర్ ఈ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తిరుపతిలోని నాలుగు క్రికెట్ మైదానాల్లో పోటీలు విజయవంతంగా నిర్వహించగా, అదనపు వైద్య విద్య సంచాలకులు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు పర్యవేక్షణలో ఏర్పాట్లు జరిగాయి.శనివారం జరిగిన ఫైనల్ పోరులో కర్నూలు వైద్య కళాశాల జట్టుతో ఎస్వీ వైద్య కళాశాల జట్టు హోరాహోరీగా తలపడింది. ఆసక్తికరంగా సాగిన ఈ మ్యాచ్‌లో ఎస్వీ వైద్య కళాశాల విజయం సాధించి రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచింది. ఈ విజయం కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ డాక్టర్ జి. రవి ప్రభు పేర్కొన్నారు.ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ టి. సాయి సుధీర్ మాట్లాడుతూ, క్రీడలు విద్యార్థుల్లో స్నేహభావం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. గెలుపు--ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తి ప్రతి వైద్య విద్యార్థిలో ఉండాలని సూచించారు.అనంతరం విజేతలైన ఎస్వీ వైద్య కళాశాల జట్టుకు ట్రోఫీ, ప్రశంసాపత్రాలు, గోల్డ్ మెడల్స్ అందజేసి ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. మనోహర్, డాక్టర్ తులసిరామ్, డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ రోజా రమణి, డాక్టర్ శ్రీనివాస్ యాదవ్, డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం క్రీడల విభాగం డాక్టర్ త్రిమూర్తులు, డాక్టర్ శరవణ, ఎస్వీ వైద్య కళాశాల అధ్యాపకులు, వైద్య విద్యార్థులు, పీఆర్ఓ వీర కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం లో ఎస్ఐఆర్ 2026 డిజిలేషన్ స్పెషల్ స్పెషల్ క్యాంపు

**ఇబ్రహీంపట్నం, జులై 11 (వార్తా ప్రభ ప్రతినిధి):**ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ 2026 డిజిలేషన్ స్పెషల్ స్పెషల్ క్యాంపు తేదీ 11,12 లలో మరియు తేదీ 14వ తారీఖు లోపు ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ముగుస్తున్నందువలన మీ యొక్క ఓటును వెరిఫై చేయించుకొని బివిఎల్ఓ ను సంప్రదించి మీ యొక్క ఓటుని భద్రపరుచుకొనవలసిందిగా కోరడమైనది. లెని యెడల మీ యొక్క ఓటుని కోల్పోయే ప్రమాదం ఉన్నందున వెంటనే వెంటనే మీ దగ్గరలో ఉన్న సచివాలయం,ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 డిజిలేషన్ స్పెషల్ క్యాంప్, లేదా మున్సిపల్ కార్యాలయం వద్ద గాని మీ యొక్క ఓటుని వెరిఫై చేయించుకొని ఎపిక్ ఫార్మ్ ని సంబంధిత బివిఎల్ఓ గారికి ఇచ్చి మీ ఓటుని భద్రపరుచుకొవలని మున్సిపల్ కమిషనర్ బి శ్రీనివాస్ తెలిపారు.




# ఓటరు నమోదు ప్రక్రియ - వేగవంతం చేయాలని ఆదేశం

**పెనుగంచిప్రోలు, జూ లై 11( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా, పెనుగంచిప్రోలు మండలం లో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు (సర్) ప్రక్రియ ను జిల్లా కంట్రోలర్ స్పెషల్ ఆఫీసర్ బి. సాయి రామ్ శనివారం పరిశీలించారు.గుమ్మడి దూరు గ్రామం లో ఓటరు నమోదు కార్యక్రమం పనితీరును బీ ఎల్ వో ల ను అడిగి తెలుసుకోని, నమోదు ప్రక్రియ ను మరింత వేగవంతం గా పూర్తి చేయాలని ఆదేశించడమైనది, ఈ పరిశీలన లో మండల తహసీల్దార్ కళ్యాణి, ఎం పి డి వో. జి. శ్రీను, పంచాయతీ కార్యదర్శి జి. శ్యామ్ కుమార్, పీడీ రాముర్తి రెడ్డి, ఆర్ ఐ అబ్దుల్ హాలిం, వ్యవసాయాధికారి తదితరులు పాల్గొన్నారు,



# వియత్నంలో విషాదం.. మచిలీపట్నం వాసి మృతి

## ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గెల్లి కిషోర్.



**మచిలీపట్నం జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వియత్నంలో జరిగిన పర్యాటక స్పీడ్‌బోట్ ప్రమాదంలో మచిలీపట్నానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గెల్లి కిషోర్ భార్య గెల్లి జయశ్రీ మృతి చెందగా, కిషోర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన మచిలీపట్నంలో తీవ్ర విషాదాన్ని నింపింది.లావా సెల్ కంపెనీ తమ వ్యాపార భాగస్వాములు, డీలర్ల కోసం నిర్వహించిన విదేశీ పర్యటనలో భాగంగా గెల్లి దంపతులు వియత్నం వెళ్లారు. జూలై 11న వియత్నంలోని ఫు క్వాక్ ప్రాంతంలోని ఆన్ థోయ్ ద్వీపసమూహం సమీపంలోని హోన్ మే రుట్ వద్ద పర్యాటకులతో విహారయాత్రకు బయలుదేరిన స్పీడ్‌బోట్ ప్రమాదానికి గురైంది. సముద్రంలో ఒక్కసారిగా వాతావరణం మారడంతో బలమైన గాలులు, ఎత్తైన కెరటాల ధాటికి బోటు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో బోటులో ఉన్న మచిలీపట్నం దంపతులలో గెల్లికిషోర్ భార్య జయ శ్రీ మృతిచెందగా , భర్త ప్రాథమిక చికిత్స అనంతరం ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో పలువురు నీటిలో చిక్కుకోగా, సహాయక బృందాలు వెంటనే సహాయక చర్యలు చేపట్టాయి.

ఈ విహారయాత్రలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడుకు చెందిన 32 మంది యాత్రికులు పాల్గొన్నట్లు సమాచారం. అయితే ప్రమాదంలో ఎంతమంది మృతి చెందారు అనే విషయంపై వియత్నం ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం మచిలీపట్నానికి చెందిన గెల్లి జయశ్రీ మృతి చెందగా, ఆమె భర్త గెల్లి కిషోర్ ప్రాణాపాయం నుంచి బయటపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.జయశ్రీ మృతి వార్తతో మచిలీపట్నంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గెల్లి కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటన తెలిసిన వెంటనే స్థానిక వ్యాపార వర్గాలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి.ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను భారత రాయబార కార్యాలయం వియత్నం అధికారులతో సమన్వయం చేసుకుంటూ సేకరిస్తోంది. మృతులను గుర్తించిన అనంతరం సంబంధిత కుటుంబాలకు సమాచారం అందజేస్తున్నారు. మృతి చెందిన భారతీయుల మృతదేహాలను స్వదేశానికి తరలించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వియత్నంలోని భారత రాయబార కార్యాలయం అవసరమైన ప్రక్రియలను పూర్తి చేస్తోంది. మరో రెండు రోజుల్లో గెల్లి జయశ్రీ మృతదేహం మచిలీపట్నానికి చేరుకునే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ విషాద ఘటనపై మచిలీపట్నంలోని ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల నాయకులు గెల్లి జయశ్రీ మృతికి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతున్న గెల్లి కిషోర్ త్వరగా కోలుకుని స్వదేశానికి తిరిగి రావాలని ఆకాంక్షించారు.

# గొల్లపల్లి బూత్ నంబర్ 255 పరిశీలన

## సర్ ప్రక్రియలో బిఎల్‌ఎలు బిఎల్‌ఓ లకు పలు సూచనలు...తహసీల్దారు ఆర్ మస్తానయ్య



**చేజర్ల జూలై 11 (వార్తాప్రభ)** సర్ ప్రోగ్రాంలో భాగంగా ఈ నెల 14 తేదీ లోపల ఎన్యుమరేషన్ ఫారాలను బిఎల్‌ఓ లకు సమర్పించాలని అలా సమర్పించకపోయినట్లయితే మీ ఓటు డ్రాఫ్ట్ జాబితాలో చేర్చబడుతుందని ఓటు హక్కు కోల్పోతారని తిరిగి మళ్లీ కొత్త ఓటు నమోదుకు ఫారమ్ 6 దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుందని చేజర్ల మండల తహసీల్దారు ఆర్ మస్తానయ్య మరియు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సతీష్ ఇరువురు సర్ ప్రక్రియలో భాగంగా శనివారం చేజర్ల మండలంలోని గొల్లపల్లి గ్రామ పంచాయతీ బూత్ నంబరు 255 ను సందర్శించి బిఎల్వో సమక్షంలో ఓటర్లకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్యుమరేషన్ ఫారాలు సరైన సమయంలో అందించకపోతే జులై 21న విడుదల చేసే ముసాయిదా జాబితాలో మీ పేరు ఉండదని ఈ సందర్భంగా తెలిపారు.ఓటర్లు కచ్చితంగా ఈ విషయాలను గమనించుకోవాలని అలాగే ఓటర్లకు ఈ ఎన్యుమరేషన్ ఫారాలపై పూర్తిగా అవగాహన కల్పించాలని బిఎల్‌ఓకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బిఎల్‌ఏ ఉడత హాజరత్తయ్య పాల్గొని 255 బూత్ ను సందర్శించారు.ఈ గ్రామపంచాయతీలో ప్రతి ఒక్క ఓటరు ఎన్యుమరేషన్ ఫారాలను సరైన సమయంలో బిఎల్‌ఓకు అందజేయాలని మన ఓటు మన హక్కు కాబట్టి పూర్తి బాధ్యతగా మన ఓటు కాపాడుకోవాలని వారు సూచించారు.అలాగే ఒక్క ఓటు కూడా పోకుండా చూడాలని బిఎల్‌ఓకు తెలిపారు.

## “అయ్యో పాపం” అంటే చాలు... మొబైల్ మాయం - కొత్త ట్రిక్‌తో రంగంలోకి దొంగలు

### చంద్రగిరి ప్రజలకు పోలీసుల అప్రమత్త హెచ్చరిక : సీఐ సురేష్ కుమార్ సూచనలు

**చంద్రగిరి:జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మొబైల్ ఫోన్ల చోరీకి దొంగలు కొత్త ఎత్తుగడలను అమలు చేస్తున్నారని చంద్రగిరి సీఐ సురేష్ కుమార్ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. పోలీసు నిఘా వర్గాల సమాచారం ప్రకారం, తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఓ దొంగల ముఠా వినూత్న పద్ధతిలో మొబైల్ ఫోన్లను అపహరిస్తున్నట్లు గుర్తించారు.ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తి అకస్మాత్తుగా అదుపు తప్పి పడిపోతున్నట్లు నటించడం, దాన్ని చూసి



సాయం చేసేందుకు పరుగెత్తుకొచ్చిన వారి దృష్టి మరల్చి జేబులోని మొబైల్ ఫోన్‌ను అపహరించడం ఈ ముఠా ప్రధాన వ్యూహంగా పోలీసులు తెలిపారు. కొన్ని సందర్భాల్లో ఒక వ్యక్తి ప్రమాదానికి గురైనట్లు నటిస్తే, మరో వ్యక్తి సహాయం చేస్తున్నట్లు వచ్చి అవకాశాన్ని ఉపయోగించుకుని మొబైల్‌తో పరారవుతున్నట్లు వెల్లడించారు.ప్రజలు ఇటువంటి పరిస్థితుల్లో మానవత్వంతో స్పందించే ముందు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా తమ మొబైల్ ఫోన్, పర్సు వంటి విలువైన వస్తువులను భద్రంగా ఉంచుకోవాలని సీఐ సూచించారు.ఎవరైనా ఈ తరహా మోసానికి గురైతే వెంటనే నిందితుల ద్విచక్రవాహనం నంబర్‌ను గుర్తుంచుకుని పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అలాగే పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడం ద్వారా నేరాల నివారణకు సహకరించాలని సీఐ సురేష్ కుమార్ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# పెన్నానదిలో వ్యక్తి గల్లంతు.. మృతదేహం వెలికితీత



గట్టు వరకు మోసుకొచ్చిన ఎస్సై..మానవత్వం చాటిన పోలీసులు



**సంగం జూలై 11 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం మండలం కోలగట్ల సమీపంలోని పెన్నానదిలో ప్రమాదవశాత్తు గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు శనివారం వెలికితీశారు.మృతుడు ఆత్మకూరు మండలం బొటికర్ల పాడు గ్రామానికి చెందిన పి.శేషయ్య (55)గా గుర్తించారు. బొటికర్ల పాడు గ్రామంలో జరుగుతున్న కొలుపు సందర్భంగా నాగవరపమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు గ్రామస్థులు కోలగట్లకు వెళ్లారు. పెన్నానది తీరంలో పూజలు ముగించుకుని తిరిగి వస్తున్న సమయంలో శేషయ్య ప్రమాదవశాత్తు నీటిలో జారిపడి గల్లంతయ్యాడు.సమాచారం అందుకున్న సంగం ఎస్సై భోజ్యా నాయక్ సిబ్బందితో కలిసి వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.కొంతసేపటి అనంతరం శేషయ్య మృతదేహాన్ని నదిలో నుంచి వెలికితీశారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**గట్టు వరకు మోసుకొచ్చిన ఎస్సై**పెన్నానది ఒడ్డుకు వాహనం వెళ్లే దారి లేకపోవడంతో పోలీసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఎస్సై భోజ్యా నాయక్ గ్రామస్థులతో కలిసి కట్టెలు వస్త్రాల సహాయంతో తాత్కాలిక స్ట్రెచర్‌ను తయారు చేశారు. అనంతరం సుమారు ఒకటిన్నర కిలోమీటరు దూరం మృతదేహాన్ని భుజాలపై మోసుకుంటూ గట్టు వరకు తీసుకొచ్చారు.ఈ సందర్భంగా ఎస్సై భోజ్యా నాయక్ స్వయంగా మృతదేహాన్ని మోసే కార్యక్రమంలో పాల్గొని విధి నిర్వహణలో నిబద్ధతతో పాటు మానవత్వాన్ని చాటుకోవడం స్థానికుల ప్రశంసలు అందుకుంది.

# ప్రజా దర్బార్ కు పోటెత్తిన ప్రజానీకం

- ప్రజా దర్బార్ లో ప్రజల నుంచి నేరుగా అర్జీలు తీసుకున్న మైనారిటీ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్
- అర్జీదారుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేయండి
- మైనారిటీ శాఖ మంత్రి ఎన్‌ఎండి ఫరుక్
- ఎంపీ కేశినేని చిన్ని ఆదేశాల మేరకు రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లా ఆధ్వర్యంలో ప్రజాదర్బార్






**విజయవాడ పశ్చిమ జులై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం లో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని చిన్ని ఆదేశాల మేరకు రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి ఫతావుల్లాహ్ ఆధ్వర్యంలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి ఎం ఎం డి ఫరూక్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి నేరుగా స్వీకరించారు.ప్రజల సమస్యకు అధికారులు పరిష్కారం చూపినప్పుడు వారి ముఖంలో ఆనందం మన కృషికి దక్కిన ఫలితమని.. ప్రజా స్నేహ పూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలకు గడువులోగా నాణ్యమైన పరిష్కారాన్ని చూపేందుకు అధికారులు కృషిచేయాలని మైనారిటీ శాఖ మంత్రి ఎన్ ఎండి ఫరూక్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఫారుక్ ప్రజల నుంచి నేరుగా అర్జీలు తీసుకోవడం వారి సమస్యలు విని త్వరితగతిన సమస్యలన్నిటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. గత వైసిపి హయాంలో జరిగిన భూకబ్జాలు అనేక రకాల కేసులు మరియు వివిధ రకాల అంశాలపై అనే కార్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ ప్రజా దర్బార్ లాంటి ప్రజా సమస్యలు తెలుసుకునే కార్యక్రమం జరగాలని ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మంత్రి లోకేష్ ప్రజా దర్బార్ విషయంలో ప్రత్యేకమైన శ్రద్ధ చూపించి ప్రతి సమస్యకు పరిష్కారం వచ్చే విధంగా కృషి చెయ్యాలి అని ఆదేశించినట్లు తెలిపారు. ముఖ్యశీగా రెవెన్యూకు సంబంధించిపోలీసు శాఖకు సంబంధించి పురపాలక పట్టణాభివృద్ధికి సంబంధించి అర్జీలు వచ్చాయి ఈ అర్జీలపై ప్రత్యేకంగా దృష్టిసారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని మంత్రి ఆదేశించారు.ఈ కార్యక్రమం లో పశ్చిమ నియోజవర్గం పరిశీలకులు వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వర,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఆషా, మార్కెట్ యార్డ్ వైస్ ప్రెసిడెంట్ పాల మాధవ్,తెలుగు యువత అధ్యక్షులు మాధవ్, మైనారిటీ సెల్ నాయకులు ఎండీ ఆన్సర్,సయ్యద్ అలీ, షేక్ హబీబ్,తెలుగుమహిళాలు నసీమ,పితాని క్లస్టర్ ఇంచార్జ్ ధనేకుల సుబ్బారావు, క్లస్టర్ ఇంచార్జ్ సయ్యద్ కరీముల్లా, కో-క్లస్టర్ రమేష్ నాయక్,డివిజన్ అధ్యక్షులు జహీద్,విజయలక్ష్మి ,కుంచందు ర్గారావు,పద్మ, దుర్గా,మల్లీశ్వరి,ప్రభు చరణ్, స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# చిరుధాన్యాలు.. ఆరోగ్యం, ఆదాయానికీ బలం

- విలువ ఆధారిత ఉత్పత్తులతో సుస్థిర వ్యాపారం
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





**ఇబ్రహీంపట్నం, జులై 11(వార్తా ప్రభ ప్రతినిధి):** ఆధునిక జీవనశైలి నేపథ్యంలో సమతుల్య పోషకాహారానికి చిరుధాన్యాలు (మిల్లెట్స్) ఉత్తమ ప్రత్యామ్నాయంగా నిలుస్తున్నాయని.. పీచుపదార్థం, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజలవణాలు సమృద్ధిగా ఉండే చిరుధాన్యాలు ఆరోగ్యకర జీవితానికి పునాదులు వేస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ఈ నేపథ్యంలో చిరుధాన్యాల విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.కలెక్టర్ లక్ష్మీశ శనివారం గుంటుపల్లి రైజ్ కేంద్రంలో మిల్లెట్ ఫుడ్ ప్రొడక్ట్స్‌పై వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 80 మంది స్వయం సహాయక సంఘ మహిళలు పాల్గొనగా 9నట్జ్ సీఈవో వి.కీర్తన చిరుధాన్యాలతో తయారయ్యే విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. మెరుగైన ఉపాధి అవకాశాలకు ఇవి ఏవిధంగా సహాయపడుతున్నాయో వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ నేటి జీవనశైలికి చిరుధాన్యాలే ఆరోగ్యానికి, ఆనందానికి, ఆర్థికాభివృద్ధికి చిరునామా అని నిపుణులు సూచిస్తున్న వేళ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఇటు ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి అటు అత్యుత్తమ ఉపాధికి బాటలు వేసుకోవాలని సూచించారు. రైజ్ కేంద్రంలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లు, శిక్షణ కార్యక్రమాల ద్వారా అనేక మంది మహిళలు ఇప్పటికే పారిశ్రామిక యూనిట్లు ఏర్పాటు చేశారని.. వీరిని స్ఫూర్తిగా తీసుకొని ముందడుగు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ పిలుపునిచ్చారు.కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ఏ ఒక్కరి ఓటు రద్దు కాకుండా చూడవలసిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లదే.

### -వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ముద్రగడ బాలు.



**కిర్లంపూడి, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** అర్హులైన ఏ ఒక్కరి ఓటు రద్దు కాకుండా చూడవలసిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యత తీసుకోవాలని ముద్రగడ వీర రాఘవరావు,(బాలు)అన్నారు. మండల కేంద్రమైన కిర్లంపూడి ముద్రగడ నివాసంలో ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు ఆదేశాల మేరకు, ముద్రగడ వీర రాఘవరావు (బాలు) ఆధ్వర్యంలో ప్రత్తిపాడు నియోజకవర్గంలోని మండల కన్వీనర్లకు,మండల బూత్ లెవెల్ ఇంచార్జిలకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి కాకినాడ జిల్లా టాస్క్ ఫోర్స్ సభ్యులు వాసిరెడ్డి జమీల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.ఈ సవరణ ప్రక్రియ త్వరలోనే ముగియనున్న నేపథ్యంలో, బూత్ లెవెల్ ఏజెంట్లు ప్రతి ఒక్కరూ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు.ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ఏ ఒక్కరి ఓటు కూడా రద్దు కాకుండా చూడాల్సిన బాధ్యత బీఎల్‌ఏలపై ఉందని, దీనికోసం ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో చురుగ్గా పనిచేయాలని ఈ సమావేశంలో తీర్మానించారు.ఓటర్ల జాబితా సవరణ గడువు త్వరలో ముగుస్తున్నందున,ప్రతి బూత్ పరిధిలో ఓట్ల నమోదు మరియు మార్పులపై ప్రత్యేక నిఘా ఉంచాలని ముద్రగడ బాలు, వాసిరెడ్డి జమీల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు రామిశెట్టి నాని, నరాల శ్రీను,చింతకాయల సత్యనారాయణ, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్ తోపాటు పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రపంచ జనాభా దినోత్సవం




**మచిలీపట్నం జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో శనివారం ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డా. ప్రేమ్‌చంద్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బంది, నర్సింగ్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ, ఈ ఏడాది ప్రపంచ జనాభా దినోత్సవం థీమ్ “పిల్లల మధ్య ఎడం... ఆరోగ్యకరమైన, సంతోషకరమైన కుటుంబానికి ఆధారం” అని తెలిపారు. తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కోసం గర్భధారణల మధ్య తగిన విరామం ఉండటం ఎంతో అవసరమని, ఇందుకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను అవగాహనతో వినియోగించాలని దంపతులకు సూచించారు.వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు పిల్లల మధ్య తగిన ఎడం, కుటుంబ నియంత్రణ పద్ధతులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.కుటుంబ నియంత్రణ, ఆరోగ్యకరమైన జనన విరామం, తల్లి-శిశు ఆరోగ్య పరిరక్షణ, సంతోషకరమైన కుటుంబ నిర్మాణంపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## రైతులకు యూరియా కొరత లేదు - జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



**మచిలీపట్నం జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కృష్ణాజిల్లాలో యూరియా లభ్యతపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ స్పష్టం చేశారు. శనివారం మచిలీపట్నంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో రైతుల అవసరాలకు తగినంత యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ప్రతి రైతుకు, ప్రతి పొలానికి అవసరమైన మేర యూరియా సరఫరా చేసేలా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.యూరియా సరఫరా పై ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు వ్యవసాయ పనులు కొనసాగించాలని అన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### సంగంలో సర్ ప్రక్రియను పరిశీలించిన ఆర్డీఓ పావని



**సంగం జూలై 11 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం జెడ్పీ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆర్డీఓ పావని శనివారం పరిశీలించారు. బూత్‌ల వద్ద జరుగుతున్న ఎన్యుమరేషన్ దరఖాస్తుల స్వీకరణ డిజిటలైజేషన్ ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తహసీల్దార్ సారంగపాణికి పలు సూచనలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేసి, అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.బూత్‌ను సందర్శించిన ఆర్డీఓ పావని అక్కడికి వచ్చిన ఓటర్లతో మాట్లాడి వారికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

## బాలిక వైద్య చికిత్సకు పాత్రికేయుడి ఆర్థిక సాయం



**ఇబ్రహీంపట్నం,జూలై 11(వార్తా ప్రభ ప్రతినిధి):**లివర్ వ్యాధితో బాధపడుతున్న చిన్నారి పి.లోసి (11) వైద్య చికిత్సకు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ స్ఫూర్తితో సీనియర్ పాత్రికేయుడు బి.డేవిడ్ రాజు శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక ప్రసాద్ నగర్ కు చెందిన చిన్నారి లోషి గత కొంతకాలంగా లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న పాత్రికేయులు చిన్నారి ఇంటికి వెళ్లి ఆ కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. లోసి త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం చిన్నారికి పండ్లు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పాత్రికేయులు హఫీజ్ ఖాద్రీ, బాషా, సురేష్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## 20 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే





**పెనుగంచిప్రోలు, జూ లై 11( వార్త ప్రభ )** పేద, మధ్యతరగతి కుటుంబాలు అనారోగ్యంతో ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అందుతోందని జగ్గయ్యపేట శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పేర్కొన్నారు. పెనుగంచిప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వివిధ అనారోగ్యాల కారణంగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు, శస్త్రచికిత్సలు చేయించుకుని భారీగా వైద్య ఖర్చులు భరించారు. అనంతరం వారి వైద్య బిల్లులను స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాధితుల తరఫున ముఖ్యమంత్రి సహాయనిధికి సిఫార్సు చేసి దరఖాస్తులు చేయించారు. ఆ దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి మంజూరు చేసిన రూ. 7,47,313 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను 20 మంది లబ్ధిదారులకు పెనుగంచిప్రోలు గ్రామంలో ఆర్ కే ఫంక్షన్ హాల్ నందు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో సమర్థవంతంగా పనిచేస్తోందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో చికిత్స పొందిన కుటుంబాలకు ఈ పథకం ద్వారా ప్రభుత్వం గణనీయమైన ఆర్థిక సహాయం అందిస్తోందని చెప్పారు. జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వందలాది మంది బాధితులకు కోట్ల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి అందేలా కృషి చేశామని, భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి బాధితుడికి ఈ పథకం ద్వారా సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య తెలిపారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని, ప్రజల అవసరాలను గుర్తించి వారికి అండగా నిలిచే పాలనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని కొనియాడారు. వైద్య ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందుతున్న ఈ ఆర్థిక సహాయం అనేక కుటుంబాల్లో కొత్త ఆశలు నింపుతోందని, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం మరింత విస్తృతంగా అమలు చేస్తోందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పేర్కొన్నారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు తమ కష్టకాలంలో అండగా నిలిచి ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరుకు కృషి చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పశు సంపద అభివృద్ధి పథకాలు అమలు చేయడంలో ముందు ఉండాలి

**-జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మంగు శ్రీనివాస్ కు కొల్లు రవీంద్ర సూచన**



మచిలీపట్నం, **జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశు సంపద అభివృద్ధి పథకాలను అమలు చేయడం మరియు ఆర్థిక సహాయం అందించడం లో ముందుండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మంగు శ్రీనివాసరావు కు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా కృష్ణా జిల్లాకు నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన మంగు శ్రీనివాసరావు శనివారం మచిలీపట్నంలో మంత్రి కొల్లు రవీంద్ర కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలసి పశుసంవర్ధక శాఖ పై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం అందించే ఉచిత లేదా రాయితీ వైద్య సేవలు అందించడంలో ముందు ఉండాలని సూచించారు. అంటువ్యాధులను నివారించేందుకు టీకాలు వేయించడంలో పశువుల యజమానులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించే విధంగా క్రింది స్థాయి అధికారులు బాధ్యతాయుతంగా ఉండేలా చూడాలని సూచించారు. పశువుల మేత, పోషకాహారం మరియు సంరక్షణపై రైతులకు శిక్షణలు ఇప్పించాలన్నారు. పశు సంపద అభివృద్ధి పథకాలను అమలు చేయడం మరియు ఆర్థిక సహాయం అందించడం లో ఎక్కువ అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కోరారు. పశుసంవర్ధక శాఖ రైతుల సంక్షేమం, పశువుల ఆరోగ్య పరిరక్షణ మరియు పశుసంపద అభివృద్ధికి కీలకమైన ప్రభుత్వ శాఖ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో దీని పాత్ర ఎంతో ముఖ్యమైనదని అలాంటి పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతాయుతంగా ముందుకు వెళ్లాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మంగు శ్రీనివాసరావును అభినందిస్తూ మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మంగు శ్రీనివాసరావు మాట్లాడుతూమంత్రి కొల్లు రవీంద్ర సూచనల మేరకు జిల్లాలో పశుసంవర్ధక శాఖ మరింత బలోపేతం చేస్తూ పశు యజమానులకు, రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను అమలు చేయడంలో విశేష కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ,డాక్టర్ వీరంకి మధుబాబు, బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్, స్వర్ణ వార్డు 45 తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, పి. వి. ఫణి కుమార్, ఎస్ పి సి ఏ నెంబర్, ఏ .విజయ్ తదితరులు పాల్గొన్నారు

# కిషన్ రెడ్డికి ఘన స్వాగతం పలకండి!!

**● కార్మికులంతా భారీగా తరలిరండి ● తాడిచెర్ల బ్లాకులపై కృతజ్ఞత తెలుపుదాం ● సింగరేణి కోసం చారిత్రాత్మక నిర్ణయం ● కార్యక్రమాన్ని విజయవంతం చేయండి ● కందుల సంధ్యారాణి**



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 11 (వార్తాప్రభ):**తాడిచెర్ల బొగ్గు బ్లాకులను సింగరేణి సంస్థకు కేటాయింపునకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సింగరేణి సంస్థకు, కార్మికులకు ఎంతో మేలు చేసే చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి మంగళవారం సింగరేణి రామగుండం రీజియన్‌కు విచ్చేసి సింగరేణి కార్మికులను కలిసి శుభాకాంక్షలు తెలియజేయనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సింగరేణి కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలకాలని ఆమె పిలుపునిచ్చారు. తాడిచెర్ల బొగ్గు బ్లాకులను సింగరేణికి కేటాయించడం వల్ల సంస్థ భవిష్యత్తు మరింత బలోపేతం కావడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉపాధికి భరోసా లభిస్తుందని సంధ్యారాణి పేర్కొన్నారు. ఈ కీలక నిర్ణయం కోసం కృషి చేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సింగరేణి కార్మికులు తమ కృతజ్ఞతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సింగరేణి అభివృద్ధి, బొగ్గు ఉత్పత్తి పెంపు, కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు మద్దతుగా ప్రతి కార్మికుడు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కందుల సంధ్యారాణి తన పత్రికా ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# నేతాజీ నగర్ లో పర్యటించిన ఎమ్మార్వో

**- ఇంటి ఇంటికి తిరిగి ఓటర్ నమోదు చేయాలని కోరిన బేరీ రాశీచందర్ యాదవ్**





**హైదరాబాద్ ,జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)::** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ నమోదు ప్రక్రియ లో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, బస్తీలో చాలా మంది నిరుపేదలు నివసిస్తున్నారు. కాబట్టి వారికి చదువు రాకపోవడంతో ఫారాలు నింపడం లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ కాలని అద్యక్షుడు బేరి రాశీచందర్ యాదవ్ అన్నారు. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆయన కోరిక మేరకునేతాజీ నగర్ కాలనీలో ఓటర్ నమోదు కార్యక్రమం పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం రోజు శేరిలింగంపల్లి ఎమ్మార్వో మహిపాల్ రెడ్డి కాలనీలో పర్యటించి ఓటర్ నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికి తిరిగి నమోదు చేయాలని బిఎల్ఎ, బిఎల్ఓ లకు వివరించారు. కాలనీ అధ్యక్షులు రామచందర్ యాదవ్ మాట్లాడుతూ అధికారులు చొరవ తీసుకుని ప్రజలకు సహకరించాలని, ప్రజల అనుమానాలను నివృత్తి చేస్తూ ఓట్లు గల్లంతు కాకుండా చూడాలన్నారు. అవసరమైతే అధికారుల ను పెంచాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఎలక్షన్ అధికారి దీపక్ కుమార్, బి ఎల్ ఓ పరమేష్ కాలనీ ఉపాధ్యక్షులు రాయుడు, బుడగ జంగాల పంతం వెంకటేష్, పంతం శీను, నాగపురి నగేష్ యాదవ్, ఎండి జాఫర్, శివ యాదవ్, మరియు నేతాజీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కాలనీ సభ్యులు కాలనీ పెద్దలు మహిళా సోదరుల యోజన నాయకులు పాల్గొన్నారు ఓటు మన హక్కు ఓటు నమోదు కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలనీ బేరి రామచందర్ యాదవ్ కోరారు.

# మీ భాగస్వామ్యమే ఓటు భద్రతకు భరోసా!

**- ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఇక 3 రోజులే! - క్షేత్రస్థాయిలో ఓటర్ల సేవలో అధికార యంత్రాంగం - బీఎల్‌వోలు, ప్రత్యేక శిబిరాలు, హెల్ప్ డెస్కులు అందుబాటులో - సర్ ప్రక్రియలో విజయం గమ్యానికి చేరువైన డిజిటైజేషన్ - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**ఇబ్రహీంపట్నం, జులై 11 (వార్తా ప్రభ ప్రతినిధి):**భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణకు ఈ నెల 14వ తేదీతో గడువు ముగియనున్నందున, ఇంకా ఎన్యూమరేషన్ ఫారాలు సమర్పించని ఓటర్లు తమ ఫారాన్ని బీఎల్‌వోకు తప్పనిసరిగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఫారం సమర్పణలో ఎలాంటి ఇబ్బంది ఉన్నా సహాయసహకారాలు అందించేందుకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఇబ్రహీంపట్నం మండలం, గుంటుపల్లిలో పర్యటించి సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుతెన్నులను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ, డిజిటైజేషన్ పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారంతో పాటు ఆదివారం కూడా సర్ ప్రత్యేక శిబిరాలు అందుబాటులో ఉంటాయని వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని నియోజకవర్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించడంతో పాటు ఫారాల సమర్పణలో సందేహాల నివృత్తి కోసం అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉన్నారని చెప్పారు. ప్రతి ఓటరు ఈ ప్రక్రియలో భాగస్వామి కావడం ద్వారా ఓటర్ల జాబితా మరింత కచ్చితత్వంతో, దోష రహితంగా రూపొందించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. చివరి రోజు వరకు వేచి చూడకుండా వెంటనే ఎన్యూమరేషన్ ఫారాన్ని సమర్పించి ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

**కీలక మైలురాయిని దాటిన సర్ (82.15 శాతం డిజిటైజేషన్):**జిల్లాలో సర్ ప్రక్రియ విజయం గమ్యానికి చేరడంలో కీలకమైలురాయిని చేరుకుంది. 14,07,640 (82.15 శాతం) ఎన్యూమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పూర్తయింది. తిరువూరు నియోజకవర్గంలో 1,84,365 (88.34 శాతం), విజయవాడ పశ్చిమ 1,98,187 (77.12 శాతం), విజయవాడ మధ్య 2,17,887 (78.43 శాతం), విజయవాడ తూర్పు 2,14,234 (79.42 శాతం), మైలవరం 2,40,411 (84.31 శాతం), నందిగామ 1,75,955 (84.81 శాతం), జగ్గయ్యపేట 1,76,601 (85.09 శాతం) ఫారాల డిజిటైజేషన్ పూర్తయింది.

# సివిల్స్ ఆశావహులకు శుభవార్త

**● 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం'కు దరఖాస్తుల స్వీకరణ ● ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైన తెలంగాణ యువతకు రూ.లక్ష ఆర్థిక ప్రోత్సాహకం ● సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ● గత రెండేళ్లలో 346 మంది అభ్యర్థులకు లబ్ధి**




**హైదరాబాద్, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రం నుంచి సివిల్ సర్వీసెస్ మెయిన్స్ కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు శుభవార్త. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం' పథకాన్ని కొనసాగిస్తున్నట్లు సింగరేణి సంస్థ సీఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించిన తెలంగాణ ప్రాంత అభ్యర్థుల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి సింగరేణి సంస్థ తరఫున రూ. 1,00,000 చొప్పున ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, దరఖాస్తులను పరిశీలించి అర్హత సాధించిన ప్రతీ అభ్యర్థికి ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందజేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు www.scclmines.com వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. సింగరేణి అందిస్తున్న ఈ ఆర్థిక ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుని ఈ ఏడాది మరింత ఎక్కువ మంది తెలంగాణ యువత సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించి రాష్ట్రానికి, దేశానికి సేవలందించాలని డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆకాంక్షించారు.

**ఇది నేపథ్యం** రాష్ట్రం నుంచి అత్యధిక సంఖ్యలో యువత సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించాలనే లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు, సింగరేణి సంస్థ తన కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా ఈ పథకాన్ని 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా ప్రారంభించినట్లు డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. 'రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం అమలులో భాగంగా 2024 సివిల్స్ ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణులైన 140 మంది అభ్యర్థులకు ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందించామని తెలిపారు. వారిలో 20 మంది ఇంటర్వ్యూకు ఎంపిక కాగా, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వారికి మరో రూ. లక్ష చొప్పున అదనపు ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించామని, చివరకు ఏడుగురు సివిల్ సర్వీసెస్‌లో విజేతలుగా నిలిచారని వెల్లడించారు. గత ఏడాది ఈ పథకం కింద 206 మంది అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకం అందించగా, వారిలో 50 మంది ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని, చివరకు 20 మంది సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారని తెలిపారు. ఈ విధంగా గత రెండేళ్లలో మొత్తం 346 మంది అభ్యర్థులకు సింగరేణి సంస్థ ఆర్థిక ప్రోత్సాహకాన్ని అందించిందని వెల్లడించారు.

## హుజూర్‌నగర్--కోదాడలను తెలంగాణ అభివృద్ధికి చిరునామాలుగా తీర్చిదిద్దుతాం

**ప్రతి హామీని కార్యరూపంలోకి...**
**ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాటలోకి తీసుకువెళ్తాం**
**రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి శంకుస్థాపన చేసిన రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హుజూర్‌నగర్, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల అభివృద్ధి తనకు రాజకీయ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసానికి ఇచ్చే జీవనాంత కృతజ్ఞత అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ రెండు నియోజకవర్గాలను తెలంగాణలోనే అత్యుత్తమ మౌలిక వసతులు, ఆధునిక విద్య, నాణ్యమైన వైద్యం, శాశ్వత సాగునీటి వసతులు కలిగిన ఆదర్శ నియోజకవర్గాలుగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పనిచేస్తోందని స్పష్టం చేశారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి రూ. 21 కోట్ల వ్యయంతో కోదాడలో నూతన ఆర్టీసీ బస్ డిపో నిర్మాణానికి, హుజూర్‌నగర్ బస్ స్టాండ్ ఆధునికీకరణ పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. హుజూర్‌నగర్, కోదాడ ప్రజలతో తన బంధం ఎన్నికలతో ఏర్పడింది కాదని, మూడు దశాబ్దాలకు పైగా విశ్వాసం, ఆప్యాయత, పరస్పర నమ్మకంతో నిర్మితమైన అనుబంధమని ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఆరు సార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు తనను గెలిపించిన ప్రజల ఋణం తీర్చుకోవడానికి అభివృద్ధినే మార్గంగా ఎంచుకున్నానని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని పేర్కొన్న మంత్రి, రెడ్లకుంట, ఆర్--9, శాంతినగర్ ఎత్తిపోతల పథకాలతో పాటు నాగార్జునసాగర్ ఆయకట్టు మేజర్, మైనర్ కాలువలకు లైనింగ్ పనులు చేపట్టి ప్రతి ఎకరాకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హుజూర్‌నగర్--కోదాడలను శాశ్వత సాగునీటి భరోసా కలిగిన పచ్చని వ్యవసాయ ప్రాంతాలుగా మార్చడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో కూడా చారిత్రాత్మక పెట్టుబడులు పెడుతున్నామని మంత్రి వెల్లడించారు. రూ. 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాల, రూ. 50 కోట్లతో జవహర్ నవోదయ పాఠశాల, రూ. 26 కోట్లతో సిటీ స్కాన్ సౌకర్యంతో కూడిన 100 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి, యువతకు అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలు అందించే అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోదాడ పురపాలక సంఘాన్ని ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, పట్టణ సుందరీకరణ వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. హుజూర్‌నగర్, కోదాడ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలు మాత్రమే కాదని, ప్రజాస్వామ్య విలువలకు అండగా నిలిచిన రాజకీయ చైతన్యానికి ప్రతీకలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి లక్షా ఐదు వేలకుపైగా, కోదాడలో లక్ష ఓట్లకు పైగా వచ్చిన భారీ మెజారిటీ ప్రజలు అభివృద్ధి రాజకీయాలకు ఇచ్చిన అపూర్వ తీర్పుగా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. "అభివృద్ధి విషయంలో మా ప్రభుత్వానికి రాజకీయ భేదాలు లేవు. ప్రతి గ్రామం, ప్రతి రైతు, ప్రతి విద్యార్థి, ప్రతి మహిళ, ప్రతి యువకుడు ప్రభుత్వ అభివృద్ధి ఫలాలను అందుకోవాలి. అదే కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా తత్వం. హుజూర్‌నగర్--కోదాడలను తెలంగాణలోనే ఆదర్శ అభివృద్ధి నమూనాలుగా నిలబెట్టే వరకు మా ప్రయాణం ఆగదు" అని మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.సి. సజ్జనార్ స్థానంలో ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎండీ నాగిరెడ్డి, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ఎస్ఎస్ జీ వార్షిక క్రీడల పోటీలు

**ముఖ్య అతిథిగా హాజరైన ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్రలడ్డా**



**అమరావతి, జూలై 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ ఇంటెలిజెన్స్ విభాగంలోని స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ వార్షిక క్రీడల పోటీలు ఘనంగా జరిగాయి. మంగళగిరిలోని ఎస్ఎస్ జీ గ్రౌండ్స్ లో నిర్వహించిన ఈ క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మహేష్ చంద్ర లడ్డా, ఐజీ పీహెచ్ డీ రామకృష్ణ తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ డైరెక్టర్ ఏ.జగదీష్, ఎస్పీ చెన్నుపాటి భద్రయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వార్షిక పోటీల్లో 25 క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటెలిజెన్స్ చీఫ్ మహేష్ చంద్ర లడ్డా టగ్ ఆఫ్ వార్ పోటీలను ప్రారంభించారు. క్రీడల పోటీల్లో ఆరు విభాగాల్లో మొదటి స్థానంలో నిలిచిన ఎస్. కమలేంద్రరావు ఈ ఏడాది వార్షిక క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్ గా నిలిచారు. క్రీడలు శారీరక ధృడత్వాన్ని మానసిక ఉల్లాసాన్ని, టీమ్ స్పిరిట్ ను పెంపొందిస్తాయని ఇంటెలిజెన్స్ చీఫ్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. కార్యక్రమం ముగింపులో అందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేశారు. వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. క్రీడాపోటీలను నిర్వహించేందుకు సహకరించిన ఆచార్య నాగార్జునా విశ్వవిద్యాలయం అధికారులు, శాప్ చైర్మన్ రవినాయుడు, ఇతర అధికారులకు స్పెషల్ సెక్యూరిటీ గ్రూప్ ధన్యవాదాలు తెలియచేసింది.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు మరో 3 రోజులు..
# ప్రతి ఓటును గుర్తించాలని ఎమ్మెల్యే రాము పిలుపు

● 14వ తేదీ అర్ధరాత్రి వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించే అవకాశం..



**గుడివాడ,జూలై 11 (వార్తాప్రభ) :** ఎస్ఐఆర్ ప్రక్రియకు మరో 3 రోజుల్లో ముగియనున్న దృష్ట్యా.. ప్రతి ఓటును గుర్తించే ప్రక్రియ లో టిడిపి బి.ఎల్.ఎ లు, పార్టీ యంత్రాంగం కష్టపడాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు. గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎస్ఐఆర్ ప్రక్రియకు మరో మూడు రోజులు మాత్రమే మిగిలి ఉందన్నారు. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని అధికారులు, బీఎల్వోలతో పాటు పార్టీ యంత్రాంగం అంతా ఓట్ల నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో తమ వద్ద ఉన్న డేటాను ఏఐ ద్వారా అనుసంధానించి మరింత సమాచారం సేకరిస్తున్నామని వెల్లడించారు. మారుమూల గ్రామాల నుంచి ప్రతి ఒక్క ఓటరును గుర్తించే పనిలో నిమగ్నమయ్యామని, ఇల్లు మారిన వారు, వేరే ప్రాంతాలకు వెళ్లిన వారిని కూడా గుర్తిస్తున్నామని చెప్పారు. పార్టీ యంత్రాంగం కృషి ఫలితంగా ఇప్పటికే చాలా మందిని గుర్తించగలిగామని, ఈ చివరి మూడు రోజుల్లో మరింత మందిని గుర్తిస్తామని ధీమా వ్యక్తం చేశారు. 14వ తేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించే అవకాశం ఉందనీ, తమ పరిధిలోని ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద బీఎల్వోలు అందుబాటులో ఉంటారని, లేదా స్థానిక కూటమి నాయకత్వాన్ని సంప్రదించవచ్చని సూచించారు. ఈ మూడు రోజులు ప్రభుత్వం చేస్తున్న కృషికి అందరం సహకరించాలని పార్టీ యంత్రాంగానికి ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.

# ఘనంగా బిజేపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు సూరే గాంధీ జన్మదిన వేడుకలు





**గుడివాడ,జూలై 11 (వార్తాప్రభ) :** భారతీయ జనతా పార్టీ (బిజేపీ) సీనియర్ నాయకులు, కృష్ణా జిల్లా ఉపాధ్యక్షులు సూరే లక్ష్మీనారాయణ (గాంధీ) 50వ జన్మదిన వేడుకలు గుడివాడ బిజేపీ ఆఫీసు నందు శనివారం ఉదయం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆక్వా బోర్డు స్టేట్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీ రాజబాబు మాట్లాడుతూ బిజెపిలో ఏ బాధ్యత ఇచ్చిన తూచా తప్పకుండా ఇంకోటి అడక్కుండా దాంట్లోనే ఇమిడిపోయి పార్టీని క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో సూరే గాంధీ ముందుంటారన్నారు. అలాంటివారికి భగవంతుడు ఆశీస్సులు పుష్కలంగా ఉండే ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జరుపుకోవాలని మనసారా కోరుకుంటున్నానని తెలిపారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు అంగడాల సతీష్ మాట్లాడుతూ అసెంబ్లీ కన్వీనర్ గా నాలుగు సార్లు పార్లమెంట్ కన్వీనర్ గా ఇప్పుడు జిల్లా ఉపాధ్యక్షులుగా బాధ్యతలు తీసుకొని పార్టీని ఒక దేవాలయం గా భావిస్తూ పనిచేసిన గాంధీకి శు భాకాంక్షలు తెలియజేశారు. మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఆలమూరు మురళీ కృష్ణ మాట్లాడుతూ పార్టీ కోసం గత 32 సంవత్సరాలుగా గాంధీ వివా దరహితుడుగా అందరితో కలుపుకుపోయి పని చేస్తున్నారని అన్నారు. బిజెపి నాయకులు లింగం చిట్టిబాబు మాట్లాడుతూ ప్రతి బిజెపి కార్యకర్త సూరే గాంధీ ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆర్యవైశ్య కళ్యాణ మందిరం అధ్యక్షులు పోకూరి మోహన్‌రావు మాట్లాడుతూ బిజేపీ లో ఒక మంచి నాయకుడిగా గాంధీ ఎదిగారని భవిష్యత్తులో ఎన్నో పదవులు తీసుకొని ఉన్నతస్థాయికి ఎదగాలనీ అన్నారు. ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షులు జవ్వాజి గంగరాజు మాట్లాడుతూ సూరే గాంధీ ఎవరు ఎన్ని చెప్పినా పార్టీ మారకుండా ఉన్నారని, అలాంటివారు ఆర్యవైశ్యుల లో ఎదగడం గర్వకారణంగా ఉందని తెలియజేశారు. పట్టణ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ, కోనేటి వెంకటేష్ లు జన్మదిన శుభాకాంక్షలు తెలి యజేశారు. అనంతరం సూరే గాంధీ మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశీ స్సులు, భగవంతుని ఆశీస్సులు, నేను నమ్మిన వారి ఆశీస్సులు, నన్ను నమ్మిన వారి ఆశీస్సులు వలన నేను పార్టీలో అనేక బాధ్యతలు నిర్వహిం చానని పార్టీని దేవాలయంగా భావిస్తారని నేను కేవలం భక్తుడిని మాత్రమే అని.. నాకు ఇన్ని అవకాశాలు పార్టీ ద్వారా కల్పించిన ఆక్వా బోర్డ్ డైరెక్టర్ గుత్తికొండ శ్రీ రాజబాబు, మాజీ జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటకృష్ణ లకు ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నానని, అలాగే నాకు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు. పట్టణ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు వలపర్ల వెంకటేశ్వరరావు, శలంకాయల మురళీకృష్ణ, కొత్త వెంకట చలపతిరావు, మాకాని జనార్దన్, యువమోర్చా జిల్లా కార్యదర్శి జి ఫణి కుమార్, కొత్త కిరణ్, కటకం తిరుపాల్ గుప్తా, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షులు అంకమరాజు మహిళా మోర్చా నాయకురాలు, కార్యకర్తలు, సూర్య గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

# నోట్ బుక్స్ పంపిణీ చేసిన ఆర్కే వారియర్స్



**గుడివాడ,జూలై 11 (వార్తాప్రభ) :** ఆర్కే వారియర్స్ ఆధ్వర్యంలో శనివారం పెద ఏరుకపాడు మునిసిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో చిన్నారులకు ఉచితంగా నోటుపుస్తకాలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా గుడివాడ పట్టణ బిజెపి అధ్యక్షులు డాక్టర్ మాచర్ల రామకృష్ణ (ఆర్.కే.) మాట్లాడుతూ విద్యాభివృద్ధితోనే దేశ అభివృద్ధి ముడిపడి ఉందని, భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్, భారత మాజీ రాష్ట్రపతి డా. అబ్దుల్ కలామ్ లు పేర్కొన్నారన్నారు. ఎన్నో దశాబ్దాలుగా ఆర్.కే. వారియర్స్ నిర్వహిస్తున్న పలు సామాజిక సేవా కార్యక్రమాలు స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, ప్రధానోపాధ్యాయిని పద్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఐపీఎస్ అధికారి సుబ్రమణ్యేశ్వర రావు జన్మదిన వేడుక



**గన్నవరం, జూలై 11 (వార్తాప్రభ) :** దావాజీగూడెం సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బెంగళూరు ఇన్స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు జన్మదిన వేడుకలను వెంకటేశ్వర ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు. విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువ లు మరియు సమాజ సేవ పట్ల అవగాహన పెంపొందించు కోవాలని విద్యార్థులను ఉద్దేశించి వెంకటేశ్వరరావు సూచించారు. అనంతరం బాలికల చేతుల మీదుగా కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరిపారు. ఈ కార్యక్రమంలో వల్లూరి చక్రవర్తి వసతి గృహ సిబ్బంది పాల్గొని సుబ్రహ్మణ్యేశ్వరరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పౌష్టిక ఆహార కిట్ల పంపిణీ



**గుడివాడ,జూలై 11 (వార్తాప్రభ) :** స్థానిక ఏలూరు రోడ్డు –వర్ల బజార్ వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గర్భిణీ బాలింతలకు పౌష్టిక ఆహార కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చింతపల్లి సుగుణావతి ముఖ్యఅతిథిగా పాల్గొని సమావేశాన్ని ఉద్దేశించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణీలు రక్తహీనతకు గురికాకుండా యూట్యూబ్, గూగుల్ సలహాలు కాకుండా వైద్యుల సలహా మీద మందులు ఆహారాన్ని తీసుకోవాలన్నారు. అదేవిధంగా బాలింతలు కూడా తల్లిపాల శ్రేష్టత కొరకు మంచి ఆహారాన్ని స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు గుళ్లపల్లి కిరణ్ బాబు, గండు నరేష్, పూర్వ సహాయ గవర్నర్ ముళ్ళపూడి రమణమూర్తి, పూర్వాధ్యక్షులు అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు, బలుసు శంకర్రావు, ఏ మారుతీ ప్రసాద్, కొల్లి శ్రీనివాసరావు, సాగిరాజు ఉదయభాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ లోకాదలత్



**తిరువూరు,జూలై 11 (వార్తాప్రభ) :** తిరువూరు కోర్టు ప్రాంగణంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి శ్రీమతి అట్లూరి సిందూర ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ 47 సివిల్ ,క్రిమినల్, ఎక్సైజ్ 215 మరియు ఇతర కేసులు 5049 పరిష్కరింపబడినవి తెలిపిన --జడ్జి సింధూర ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎపిపి షేక్ బడేమియా, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సంకురాత్రి జనార్దనరావు,జనరల్ సెక్రటరీ జి.కృ ష్ణారెడ్డి,లోక్ అదాలత్ మెంబరు యమ్. రాము మరియు న్యాయవాదులు

# పి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా మెహర్



**కాకినాడ,జూలై 11 (వార్తాప్రభ) :** స్థానిక పి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్ గా ఎం. వి. కె.మహర్ ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తరాలు జారీ చేసింది. పెరుమాళ్ళపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా విధులు నిర్వహిస్తున్న ఎం.వి.కే. మెహర్ భౌతికశాస్త్ర ప్రొఫెసర్ గా విధులు నిర్వహిస్తున్నారు. చాలా సంవత్సరముల భోదన, పరిశోదన, పరిపాలనా అనుభవము గల ఆయన్ను ప్రతిష్టాత్మకమైన పి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా నియమించడం విశేషం. ఆయన త్వరలో ప్రిన్సిపల్ గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

# జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డ్ కార్యదర్శిగా ముక్తోజు సుధాకర్ నియామకం

## ఘనంగా సత్కరించిన బీసీ సంఘం నేతలు



**మార్కాపురం,జూలై 11 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా పరీక్షల నిర్వహణ బోర్డు కార్యదర్శిగా నియమితులైనటువంటి బీసీ భవన్ కమిటీ ఉద్యోగుల విభాగం ప్రధాన కార్యదర్శి ముక్తోజు సుధాకర్ కు ఈరోజు సాయంకాలం స్థానిక బీసీ భవన్ లో ఘన సన్మానం నిర్వహించడం అయినది. ఈ సన్మానాన్ని ఏర్పాటు చేసినటువంటి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పిన్నిక లక్ష్మీ ప్రసాద్ యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు ఇల్లూరి రంగస్వామి గౌడ్ లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నేత పి ఎల్ పి యాదవ్ మాట్లాడుతూ 2011వ సంవత్సరంలో ప్రారంభించిన టువంటి మార్కాపురం బీసీ భవన్ కమిటీలో అత్యంత చురుకుగా పనిచేస్తూ మొట్టమొదటి బీసీ ఉద్యోగుల సంఘానికి పాలెం చెంచయ్య అధ్యక్షులుగాను సుధాకర్ ప్రధాన కార్యదర్శి గాను సేవలందించారని తెలియజేశారు. సుమారు పదిమంది బీసీలకు నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్ సంపాదించడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని అవగాహన లేని అధికారులకు రికార్డు పరంగా అవగాహన కల్పిస్తూ తామందరము సంపన్న శ్రేణి కిందికి రామన్న విషయాన్ని తెలియపరుస్తూ నాన్ క్రిమిలేయర్ సర్టిఫికెట్లు సాధించినటువంటి చరిత్ర మార్కాపురం బీసీ భవన్ కమిటీకి ఉందని తెలియజేశారు. దానితోపాటు పలువురు బీసీ సంఘాల్లో ఉన్నటువంటి కుల సంఘాల ప్రతినిధులతో మార్కాపురంలో ఇప్పటివరకు బీసీ బాలికల వసతి గృహం లేని కారణంగా అనేకమంది బాలికలు త్రిపురాంతకం పుల్లలచెరువు వంటి ప్రాంతాల నుంచి కూడా చదువుకోవడం కోసం మార్కాపురం పట్టణంలో ఉన్నటువంటి బాలికల ఉన్నత పాఠశాలకు రావటం ఇక్కడ బాలికల వసతి గృహం లేదన్న విషయాన్ని తెలుసుకొని నిరాశ నీ చదువును కొనసాగించలేక తిరిగి వెళ్ళిపోతున్న సంఘటనలో కోకోళ్లలుగా ఉన్నాయన్నారు .. అటువంటి పరిస్థితిని మార్కాపురం బీసీ భవన్ కమిటీకి తెలియపరచినటువంటి వ్యక్తుల యొక్క సలహా మేరకు 2021 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం 30 మంది బాలికలను మార్కాపురం ఎస్సీ గర్ల్స్ హాస్టల్లో చేర్పించేందుకు పలుమార్లు ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి అప్పుడున్నటువంటి ఆర్డీఓ తర్వాత వచ్చినటువంటి ఐఏఎస్ అధికారుల యొక్క సహకారంతో వారిని హాస్టల్ లో చేర్చడం జరిగిందని తెలియజేశారు. బాలికలకు సొంత భవనంలో వసతి గృహాన్ని ఏర్పాటు చేయించాలని పలుమార్లు వినతి పత్రాలను సంబంధిత అధికారులకు సబ్ కలెక్టర్ లకు జిల్లా కలెక్టర్లకు అందజేసినటువంటి పరిస్థితి ఉందని ఇటీవల కాలంలో మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చొరవతో మార్కాపురానికి బీసీ బాలికల వసతి గృహం శాంక్షన్ అయిన విషయం ఎంతో ఆనందించదగ్గ విషయమని ఆయన తెలియపరిచారు. ఈ విద్యా సంవత్సరం నుండి ఒక ప్రైవేటు భవనంలో బాలికల వసతి గృహం ప్రారంభం కానున్న దాన్ని కూడా తమ దృష్టికి వచ్చిందని వారు తెలియపరిచారు. బీసీ లందరి ఐక్యత వల్లనే మార్కాపురం ప్రాంతంలో బీసీ భవన్ కమిటీ కొంత మేరకు ఇబ్బంది పడుతున్నటువంటి బీసీలకు అండగా నిలుస్తుంది అని ఇల్లూరి రంగస్వామి గౌడ్ తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నటువంటి పలువురు బీసీ సోదరులలో ప్రముఖ యువ న్యాయవాది పిన్నిక నాగార్జున ప్రసాద్ యాదవ్, విశ్రాంత ఉద్యోగి బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పాలెం చెంచయ్య నాయి, గౌడ ఉద్యోగుల సంఘం అధ్యక్షు లు ఉపాధ్యాయ విభాగానికి చెందినటువంటి కొమర వెంకటేశ్వర్లు గౌడ్, నాయి బ్రాహ్మణ ఉద్యోగుల సంఘం నాయకులు వంకేశ్వరం శ్రీనివాస్ నాయి, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు సిహెచ్ సత్యనారాయణ ఆచారి, గౌడ సంఘం నాయకులు నాగార్జున గౌడ్, రంగారావు గౌడ్, సతీష్ గౌడ్, అల్లూరయ్య గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, కాటమరాజు గంగాభవాని దేవస్థానం కమిటీ ప్రధాన కార్యదర్శి బుర్రి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పిన్నిక చక్రపాణి యాదవ్, నాగం వెంకటేశ్ యాదవ్, ఆర్ రాంబాబు ముదిరాజ్ తదితరులు పాల్గొని సుధాకర్ కు అభినందనలు తెలియజేశారు.

# కాసాని గూడెంలో సింధూర్ కుంకుమార్చన

–పాల్గొన్న విహెచ్ పి ఆర్ ఎస్ ఎస్ బీజేపీ



**పెడన,జూలై 11 (వార్తాప్రభ) :** విశ్వ హిందూపరిషత్ దుర్గా వాహిని మాతృ శక్తి ఆధ్వర్యంలో మచిలీపట్నం గొడుగుపేట కాసాని గూడెం లోని శ్రీ వల్లి దేవసేనసమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం నందు సింధూర్ కుంకుమార్చన రుద్రాక్ష అర్చన ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమం లో విశ్వ హిందూపరిషత్ దుర్గా వాహిని మాతృ శక్తి సభ్యులతో పాటు పుర ప్రముఖులు వి హెచ్ పి బీజేపీ ఆర్ ఆర్ ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ వారు ప్రసాద వితరణ ఏర్పాటు చేసినారు. పూజలో పాల్గొన్న సభ్యులు సువాసినులకు కార్యకర్తలకు విశ్వహిందూ పరిషత్తు అధ్యక్షుడు బూరగడ్డ శ్రీనాథ్ అభినందనలు తెలియచేశారు. ఇలాంటి సామాజిక సామూహిక కార్యమాల ద్వారా హిందూ సమాజంలో ఐక్యత సాధించటమే కాక విశ్వ మానవ శ్రేయస్సు, కళ్యాణమే విశ్వహిందూ పరిషత్తు ధ్యేయమని తెలియ చేయటం జరిగింది. కృష్ణా జిల్లా లోని అన్ని గ్రామాల్లోనూ ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆయన .ఈకార్యక్రమంలో వి హెచ్ పి జిల్లా కార్యదర్శి రాజశేఖర్ దుర్గావాహిని కృష్ణాజిల్లా ప్రముఖ్ తులసీ వసుంధర అంబటి కృత్తివెన్ను ప్రఖండ్ ప్రముఖ్ జన్యావుల ఝాన్సీ మాతృశక్తి జిల్లా ప్రముఖ్ గొట్టిముక్కల సాయి లత బీజేపీ నాయకులు ధూళిపాళ శ్రీరామ చంద్ర మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జగన్...! అసలు నీ మతం ఏమిటి? నీ అభిమతం ఏమిటి...?

● నీ రాజకీయ క్రిడ కోసం ఇంత నీచమైన వత్తాసు పలకడం అవసరమా.. ?

● టిడిపి అధికార ప్రతినిధి నల్లమోలు వెంకట శివ రామ ప్రసాద్



**పెనుగంచిప్రోలు,జూలై 11 (వార్తాప్రభ) :** జగన్! అసలు నీ మతం ఏమిటి..?, నీ అభిమతం ఏమిటి..?, నీ రాజకీయ క్రీడ కోసం ఇంత నీచమైన వత్తాసు పలకడం అవసరమా..? అంటూ విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి నలమోలు వెంకట శివరామ ప్రసాద్ జగన్ పై విమర్శలు చేశారు, శనివారం ఆయన పత్రికా విలేకర్లతో మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి హిందూ దేశంలో పుట్టి హిందూ జాతిని తూలనాడుతూ, భారతదేశం నాకు నచ్చలేదు అనే వారికి, తీవ్రవాదం వైపు మొగ్గు చూపిస్తున్న రావణ్ కు అన్ని విధాలా సపోర్ట్ చేస్తానడం అంటే జాతి విద్రోహ శక్తులకు అండగా ఉండడమే అన్నారు.జగన్ నువ్వు కూడా హిందూ వ్యతిరేకివేగా...!స్వాతంత్యం వచ్చిన తరువాత ఇంత వరకూ ఏ పార్టీ నాయకుడు కూడా మత విద్వేషాలు రెచ్చగొట్టే వారికి వత్తాసు పలికిన దాఖలాలు లేవన్నారు, ఒక్క నీ పార్టీ తప్ప, నువ్వు ఎప్పుడు నెగిటివ్ వ్యక్తులకే సపోర్ట్ చేస్తూ వచ్చావనీ, అందరూ మంచి వైపు నడవాలంటే నువ్వు చెడు వైపుకు నడుస్తావన్నారు. ప్రజలు మెచ్చింది నీకు నచ్చదు. ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపికట్టెది మరొక దారి అన్న సామెత జగన్ నిజం చేస్తున్నాడన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలంతా కుల మతాలు లేకుండా అన్యోన్యం గా జీవనం సాగిస్తుంటే అమృతం లో విషం చుక్కలు వేసి జగన్ కుల మతాలు రెచ్చ గొడుతున్నాడన్నారు. మత, కుల ప్రాతిపదిక పై రాజకీయం చేస్తే ఓట్లు పడతాయానుకోవడం నీ భ్రమ. ఒక్క మతం ప్రజలు ఓట్లు వేస్తేనే గెలుస్తారనుకోవడం నీ భ్రాంతి మాత్రమే.మంచి నీకు వ్యతిరేకమన్నారు. చెడు నీకు ఆనంద దాయకం. దేశానికి చేటు తెచ్చే వ్యక్తుల వైపే జగన్ పయనం ప్రమాదకరమన్నారు. అసలు ప్రభుత్వం సుమోటో క్రింద దేశ ద్రోహం కేసులు నమోదు చేసి జాతి విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై చర్యలు ఎందుకు తీసికోవడం లేదు అంటున్న ప్రజలు.ఇప్పటి అయినా నీ పద్ధతి మార్చుకో లేకుంటే ప్రజలే నీకు మళ్ళీ బుద్ధి చెపుతారు గుర్తు పెట్టుకో...జగన్.అన్నివెంకట శివరామ ప్రసాద్ హెచ్చరించారు..

# తండోపతండాలుగా శ్రీ వేంకటేశ్వరునికి భక్తజనం మొక్కులు..





**గుడ్లవల్లేరు,జూలై 11 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలోని భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు శనివారం భక్తజనం వేలాదిగా బారులు తీరటంతో ఆలయ ప్రాంగణమంతా భక్తులతో పోటెత్తింది. భక్తులు తమ తమ మొక్కుబడులను భక్తి ప్రపత్తులతో తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుండి వచ్చిన వేలాది మంది భక్తులకు భారీ అన్న సమారాధనను నిర్వహించారు. ఈ కార్య క్రమాన్ని మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(మెయిల్) అధినేత, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ తెలిపారు. వేలాది మంది భక్తులు అన్న ప్రసాదాల్ని స్వీకరించారన్నారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజల్ని వేద పండితులు చేపట్టారు. స్వామివారి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తీర్థ ప్రసాదాల్ని స్వీకరించారు.

# లోక్ అదాలత్‌లో 71 కేసులు రాజీ.. రూ.4.20 లక్షల జరిమానా వసూలు

## –హనుమాన్‌జంక్షన్ పోలీసుల పనితీరుకు ప్రశంసలు





**హనుమాన్‌జంక్షన్,జూలై 11 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, ఐపీఎస్ ఆదేశాల మేరకు గన్నవరం ఇన్‌చార్జి డీఎస్పీ ధర్మేంద్ర ఆధ్వర్యంలో, హనుమాన్‌జంక్షన్ సీఐ ఎల్. రమేష్ పర్యవేక్షణలో ఎస్ఐ ఎం. శ్రీనివాస్ లోక్ అదాలత్‌లో విశేష ప్రతిభ కనబరిచారు. హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 71 ఐపీసీ, బీఎన్ఎస్ కేసుల్లో ఇరువర్గాల కక్షిదారులను నూజివీడు న్యాయస్థానంలో గౌరవ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచి పరస్పర రాజీ కుదిర్చారు. అదే విధంగా మద్యం సేవించి వాహనాలు నడిపిన 42 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.4.20 లక్షల జరిమానా విధించి వసూలు చేయించారు. అలాగే బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించిన వారిపై కూడా కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. లోక్ అదాలత్ విజయవంతంగా నిర్వహించడంలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ ఎం. శ్రీనివాస్‌తో పాటు పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర అభినందించారు.

# వచ్చే నెల ఆఖరి లోపు పనులు పూర్తి చేయాలి

**• నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి • ఆగిరపల్లి శోభనాచల దేవాలయం ఘాట్ రోడ్డు 10 రోజుల్లో పూర్తి చేయాలి • నియోజకవర్గంలో పనుల పురోగతిపై అధికారులతో మంత్రి పార్థసారథి సమీక్ష**

**నూజివీడు,జూలై 11 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గంలో జరుగుతున్న డ్రైనేజి, త్రాగునీరు, సి,సి, రోడ్లు, కమ్యూనిటీ హాల్స్, బ్రిడ్జిస్, ఇతర అభివృద్ధి పనుల పురోగతి పై నూజివీడు మండల అభివృద్ధి అధికారి వారి కార్యాలయంలో గల విజన్ యాక్షన్ ప్లాన్ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధిలి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎన్ని పనులు పూర్తయ్యాయి, ఎక్కడెక్కడ పనులు జరుగుతున్నాయని మున్సిపల్ కమీషనర్, అసిస్టెంట్ ఇంజనీర్లు, మరియు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పంచాయతీరాజ్ ఇంజనీర్స్ ఇతర అధికారులను ప్రశ్నించగా పొంతన లేని సమాధానం చెప్పడంతో అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ వచ్చే నెలాఖరు లోపు మీరు చేపట్టిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరిగిన పనుల వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న రూ.5 కోట్ల పనులు సెంటర్ లైటింగ్, స్మశాన అభివృద్ధి, ప్రహరీ గోడ, అదనపు షెడ్, మరియు రోడ్ల వెడల్పు, రాజీవ్ సర్కిల్, పెద్ద గాంధీ సెంటర్, మరియు ఇతర ప్రధాన రహదారులు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా పనులు మొదలు పెట్టి సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో తోపుడు బళ్ళు వర్తకులు అంతా ఒక గ్రూపుగా ఏర్పడి గుర్తింపు కార్డులు మంజూరు చేసి రుణాలు అందించాలని మున్సిపల్ కమీషనర్ కు ఆదేశించారు. మొదటిగా మంత్రి జిల్లా సహకార పరపతి సంఘ బ్యాంక్ అధికారులతో మాట్లాడి నూజివీడు నియోజకవర్గంలో ఒక్కొక్క మండలానికి వంద యూనిట్ల చొప్పున గొర్రెలు, ఆవులు పెంపకానికి ఋణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. మరియు గృహ నిర్మాణానికి రుణాలు అందించాలని అధికారులు ఆదేశించారు. చిరు వ్యాపారస్తులు, తోపుడు బల్ల చిన్న వ్యాపారస్తులకు రుణాలు మంజూరు చేయాలని అధికారులను కోరిన మంత్రివర్యులు. పి ఎం జి వై రుణాలు అందించడంలో కోపరేటివ్ అధికారులు ముందుకు రావాలని మంత్రి కోరారు. గొర్రెలు, మేకలు, ఆవుల పెంపకానికి రెండు లక్షల నుంచి 5 లక్షల వరకు చిన్న,



సన్నకారు రైతులకు, మరియు పెద్ద ఫామ్స్ ఒక కోటి రూపాయలు వరకు రుణాలు అందించడానికి సహకరించాలని మంత్రి ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ బీసీ వారికి రుణాలపై అవగాహన కల్పించి వారికి రుణాల అందించి ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారులను కోరిన మంత్రి. చిన్నకారు రైతులకు రుణాలు అందించడంలో అలసత్యం చేస్తున్నారని వీలైనంత ఎక్కువ మంది రుణాలు అందించాలని మంత్రి ఆదేశించారు. సూర్యఘర్ సోలార్ రుణాలు అందించాలని అధికారులను కోరిన మంత్రి. డైరీ యూనిట్లు కూడా రుణాలు అందించి నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలని కోరారు. పంచాయతీ రాజ్ అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల అభివృద్ధి పనుల ప్రగతి పై మంత్రి సమీక్షించారు ఆగిరిపల్లి మండలం: రూ.21 కోట్లతో 162 పనులు ప్రారంభించగా 107 పనులు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన వాటిని వచ్చే నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించిన మంత్రి. స్వామి వారి దేవాలయానికి వేస్తున్న ఘాట్ రోడ్డును 10 రోజుల్లో పూర్తి చేయాలి. అవసరమైతే ఇసుక మెటల్ నేను అందిస్తానని మంత్రి అన్నారు. నూజివీడు మండలం: సుమారు రూ.24 కోట్లతో ప్రారంభించిన 180 పనులకు గాను 104 పనులు పూర్తికాగా మిగిలిన పనులను వచ్చే నెలలో పూర్తి చేయాలని ఆదేశించారు. వీటిలో కొన్ని సి సి రోడ్లు, బిటి రోడ్లు ఉండగా మొత్తం పనులు పూర్తిచేసి ప్రజలకు అంకితం చేయాలన్నారు. ముసునూరు మండలం: రూ.12 కోట్లతో 92 పనులు ప్రారంభించగా 79 పనులు పూర్తికాగా మిగిలిన పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన మంత్రివర్యులు. చాట్రాయి మండలం: సుమారు 6 కోట్లతో 58 పనులు ప్రారంభించగా 48 పనులు పూర్తికాగా మిగిలిన పనులు వచ్చే నెలలో పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రూరల్ వాటర్ సప్లై అధికారులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో వాటర్ ట్యాంక్ త్రాగునీటి పనులు ఎన్ని జరుగుతున్నాయని అధికారులను అడుగగా ముసునూరు మండలంలో సుమారు 11 వాటర్ ట్యాంకులు ప్రారంభించగా 4 ట్యాంకులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు 15 రోజుల్లో పూర్తి చేస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు. మండలంలో సూరేపల్లి, దేవరగుంట, పడమట, దిగవల్లి, ఎల్లాపురం గ్రామాలలో త్రాగునీటి సమస్య ఉందని త్వరలో బోర్లు మరియు వాటర్ ట్యాంక్ నిర్మించాలని ఆదేశించారు. ఎల్లాపురం గ్రామంలో వాటర్ ట్యాంక్కు నిచ్చెన అవసరం అని నిధులు లేక పూర్తి చేయలేదని అధికారులు తెలియజేయగా పంచాయతీరాజ్ నుండి నిధులు వెచ్చించి నిచ్చెన ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. త్రాగునీటికి అవసరమైన వాటర్ ట్యాంకులు మరియు త్రాగునీటి కుళాయిలు ప్రజల అవసరం మేరకు వెంటనే నిర్మించాలని మంత్రి ఆదేశించారు. నూజివీడు రూరల్‌లిలో ప్రారంభించిన డ్రైనేజి, సిసి రోడ్లు, మరియు జలజీవన్ మిషన్ పనులు, త్రాగునీరు, బోర్లు, కుళాయి పనులు లినెల లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆగిరిపల్లి మండలంలిలోని ప్రారంభించిన డ్రైనేజి, త్రాగునీరు, పైపు లైన్, బోర్లు మరియు సి సి రోడ్లు త్వరలో పూర్తి చేయాలన్నారు. నియోజకవర్గంలో ప్రారంభించిన అభివృద్ధి పనులు, డ్రైనేజి, త్రాగునీరు, సిసి రోడ్లు, జై జై ఎమ్ పనులు నిర్దేశించిన సమయానికి పూర్తిచేయాలన్నారు. ఆగిరిపల్లిలిలో జరుగు పనులు మరియు మండలంలో జరుగు పనులు శానిటేషన్, డ్రైనేజి, పైప్ లైన్, సిసి రోడ్ల పనులు లినెల లోపు పూర్తి చేయాలని, ముసునూరు మండలంలో జరుగు ఆర్డబ్ల్యూఎస్, డ్రైనేజి, సి సి రోడ్లు పనులు త్వరలో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. సమావేశంలో నియోజకవర్గ స్థాయి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య సేవల విస్తరణకు లయన్స్ క్లబ్ కృషి చేయాలి

**• సేవా కార్యక్రమాలతో గ్రామీణ ప్రజలకు అండగా లయన్స్ క్లబ్**





**హనుమాన్‌జంక్షన్,జూలై 11 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాలను గుర్తించి విద్య, వైద్య రంగాల్లో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తరించాలని, ఇంటర్నేషనల్ స్థాయిలో లయన్స్ క్లబ్ ల ద్వారా విస్తృతంగా అందిస్తున్న సేవలు అభినందనీయమని, ప్రముఖ పారిశ్రామికవేత్త, దీపక్ నెక్స్ జెన్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ అడుసుమిల్లి వేంకట సుబ్రహ్మణ్యం అన్నారు.. హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని లయన్స్ క్లబ్ మల్టీ సర్వీస్ సెంటర్ లో శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఇన్స్యూరెన్స్ అడ్వైజర్ మత్తి సాంబశివరావు ప్రెసిడెంట్ గా. రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు అక్కినేని రాఘవేంద్రరావు సెక్రటరీగా, మారుతి ఎలక్ట్రానిక్స్ అధినేత మత్తి రాంబాబు ట్రెజరర్ గా ఏకగ్రీవంగా ఎంపికైన ఇతర కొత్త కార్యవర్గ సభ్యులతో పాస్ట్ మల్టిబుల్ కౌన్సిల్ ఛైర్మన్ ఎస్ వి ఎన్ నివృతరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన మత్తి సాంబశివరావు, కాళికా దంపతులను లయన్స్ నాయకులు, అభిమానులు శాలువాలతో పూలదండలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అడుసుమిల్లి వెంకట సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద సేవా సంస్థగా గుర్తింపు ఉన్న లయన్స్ క్లబ్ ద్వారా పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య శిబిరాలు, పేద విద్యార్థులకు చేయూత, ప్రకృతి వైపరీత్యాలు వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. కొత్త కార్యవర్గం మరింత ఉత్సాహంగా పని చేయాలని సీనియర్ లయన్ నాయకులు, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పుట్టగుంట సతీష్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ డాక్టర్ దుట్టా రామచంద్రరావు, కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, ఆర్టీసీ డైరెక్టర్ గరికపాటి శివశంకర్, లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు మిరియాల వెంకటేశ్వరరావు, గద్దె శేషగిరిరావు, శంకర్ గుప్తా, వి వి పి ఏస్, ఆంజనేయులు, లయన్స్ ప్రతినిధులు చక్రవర్తి పంచకర్ల, గూడపాటి రత్నశేఖర్, కలపాల రంగారావు, చలసాని వెంకటేశ్వరావు, నందూరి సత్య వెంకటేశ్వరశర్మ, నందిగం స్వామి, కళ్ళేపల్లి నారాయణరావు, మరీదు మాధవీలత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని అతిథులను సత్కరించారు.

# పేదలకు వెన్నంటే మెయిల్ క్రిష్ణారెడ్డి సేవలు...





**గుడ్లవల్లేరు,జూలై 11 (వార్తాప్రభ) :** మండలంలోని పేద కుటుంబాల వారికి మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (మెయిల్) సంస్థ అధినేత పురిటిపాటి వేంకట క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల సేవలతో ఆర్థిక చేయూతను అందించి...వారి వారి రంగాల్లో ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వారికి వెన్నంటే ఉంటున్నారని ఆ సంస్థ పీ4 ప్రాజెక్ట్ మేనేజర్ బి.చింతయ్య, ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.రఘురామ్ పేర్కొన్నారు. పీ4(పబ్లిక్-- ప్రైవేట్ -- పీపుల్ -- పార్టనర్‌షిప్) ప్రాజెక్టులో భాగంగా క్రిష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల ఆర్థికసాయంతో మండలంలోని వేమవరానికి చెందిన అయినంపూడి విన్నీకి రూ.62,832 జీవనోపాధి గొర్రెల పెంపకం యూనిట్‌ను మెయిల్ ప్రతినిధి చేతన్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే వడ్లమన్నాడు శివారు రెడ్డిపాలానికి చెందిన బేతపూడి రాఘవమ్మకు రూ.27,100విలువైన ఇస్త్రీ బండి యూనిట్‌ను అందించారు. పేద కుటుంబాలకు మెయిల్ క్రిష్ణారెడ్డి ఈ సేవలను అందించి ఆయా కుటుంబాలకు కొత్త జీవితాలను ప్రసాదిస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో పెన్నేరు రమేష్‌బాబు, బెల్లంకొండ మాణిక్యాలరావు, బెల్లంకొండ గోవిందరాజు, పామర్తి సూరిబాబు, బెల్లంకొండ రాము, అచ్యుత్, సాయి ప్రియాంక, బంగారు మిత్ర పామర్తి దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

# లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలను కొనసాగిస్తోంది - ప్రొఫెసర్ పి.ఉదయ భాస్కర్

**• సరికొత్త ఆవిష్కరణలు తీసుకురావడంలో ఇంజనీర్లు పాత్ర ఎంతో ఉంది - ప్రొఫెసర్ వి.ఎస్.ఎస్.కుమార్ • AI సమాజంలోని అన్ని ఉద్యోగ మార్కెట్‌లను ఆక్రమించుకుంటుంది -సురేష్ కుమార్ కడియం • యల్.బి.ఆర్.సి.ఈ లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు**







**మైలవరం,జూలై 11 (వార్తాప్రభ) :** లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యలో ఉన్నత ప్రమాణాలను కొనసాగించడమే కాకుండా యువ గ్రాడ్యుయేట్‌లను సమాజానికి అందించడంలో సహాయపడుతుందని ప్రొఫెసర్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, జె.యన్.టి.యు, కాకినాడ, ఫార్మర్ ఛైర్మన్ APPSC , గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ పి.ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం పట్టణంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో 11 జూలై 2026 తేదీ శనివారం నాల్గవ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యాకమానికి ప్రొఫెసర్ పి .ఉదయ భాస్కర్, ప్రొఫెసర్ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్, జె.యన్.టి.యు, కాకినాడ, ఫార్మర్ ఛైర్మన్ APPSC , గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ముఖ్య అతిథిగా విచ్చేయగా, ప్రొఫెసర్ వి.ఎస్.ఎస్.కుమార్, ఫార్మర్ ఛైర్మన్ NITTTR, మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఫార్మర్ వైస్ ఛాన్సలర్, జె. యన్ .టి.యు, కాకినాడ మరియు సురేష్ కుమార్ కడియశీ , సీనియర్ డైరెక్టర్ , డెలివరీ అండ్ ప్రోగ్రామ్ మానేజ్మెంట్ , యూరోప్ అండ్ మిడిల్ ఈస్ట్, కాగ్నిజంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే ను ప్రొఫెసర్ పి.ఉదయ భాస్కర్ ప్రారంభించి ప్రసంగించారు. ఏ కోర్స్ చదివిన దానిలో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, కృషి, పట్టుదల తో ఆయా రంగాలలో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక వెలికి తీయడం కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయుని ఉపాధ్యాయులను కళాశాల ప్రిన్సిపాల్ ను ఉదయ భాస్కర్ అభినందించారు.

**సరికొత్త ఆవిష్కరణలు తీసుకురావడంలో ఇంజనీర్లు పాత్ర ఎంతో ఉంది:** ప్రొఫెసర్ వి.ఎస్.ఎస్.కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ అంటే కేవలం చదువు మాత్రమే కాదు, అది ఒక ఆలోచన, సృజనాత్మకత అన్నారు. నిన్నటి వరకు మనం తరగతి గదిలో విద్యార్థులం, కానీ నేటి నుంచి మనం సమాజాన్ని ముందుకు నడిపే ఇంజనీర్ల మని మన చుట్టూ ఉన్న సాంకేతికతను అభివృద్ధి చేయడంలో, సరికొత్త ఆవిష్కరణలు తీసుకురావడంలో మన పాత్ర ఎంతో ఉంటుంద ని తెలిపారు.

**AI సమాజంలోని అన్ని ఉద్యోగ మార్కెట్‌లను ఆక్రమించుకుంటుంది :** సీనియర్ డైరెక్టర్ సురేష్ కుమార్ కడియం మాట్లాడుతూ AI సమాజంలోని అన్ని ఉద్యోగ మార్కెట్‌లను ఆక్రమించుకుంటున్నందున, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు ఏ శాఖ లేదా సాంకేతికతను అనుసరిస్తున్నారో దానితో సంబంధం లేకుండా AIతో మీ ప్రయాణాన్ని ప్రారంభించాలని మరియు వ్యవస్థాపకత, వ్యాపారం, సాంకేతిక ఆవిష్కరణలను అనుసరించాలని ప్రోత్సహిం చారు.

**మన కాలేజీ ఇచ్చిన విలువలను, క్రమశిక్షణను ఎప్పటికీ మర్చిపోవద్దు :** కళాశాల ఛైర్మన్ లకిరెడ్డి ప్రసాద్ రెడ్డి ఆన్ లైన్ లో ప్రసంగిస్తూ గ్రాడ్యుయేట్‌లను మనం ఎక్కడికి వెళ్లినా, ఏ రంగంలో స్థిరపడినా మన కాలేజీ ఇచ్చిన విలువలను, క్రమశిక్షణను ఎప్పటికీ మర్చిపోవద్దని అన్నారు. భవిష్యత్తులో మీరు ఎంచుకున్న లక్ష్యాలను సాధించాలని, మీ కెరీర్ లో అంచెలంచెలుగా ఎదగాలని తెలిపారు.

**విద్యార్థులు ఎంచుకున్న రంగాలలో లక్ష్యాలను సాధించాలి :** కళాశాల కో ఫౌండర్ మరియు హానరరీ ఛైర్మన్ లకిరెడ్డి జయ ప్రకాష్ రెడ్డి ఆన్ లైన్ లో మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థిని , విద్యార్థులను అభినందిస్తూ ఆయా రంగాలలో లక్ష్యాలను సాధించాలని సూచించా రు.

**895 మంది విద్యార్థులు పట్టాలు అందుకోవడం సంతోషంగా ఉంది :** కళాశాల ప్రెసిడెంట్ జి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అండ్ డేటా సైన్స్, ఏరోస్పేస్ , సివిల్ ఇంజనీరింగ్ ,కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు మెకానికల్ ఇంజనీరింగ్ వంటి వివిధ శాఖలకు చెందిన 895 మంది విద్యార్థులు పట్టాలు అందుకోవడం సంతోషం గా ఉందన్నారు. అందులో 9 మందికి గోల్డ్ మెడల్స్ ను, 11 మంది కి సిల్వర్ మెడల్స్ ను మరియు కళాశాల టాపర్ గోదా వంశి కృష్ణ , కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థి లకిరెడ్డి బాలిరెడ్డి గోల్డ్ మెడల్ ను ఫార్మర్ ఛైర్మన్ , APPSC ప్రొఫెసర్ పి.ఉదయ భాస్కర్ తో కలిసి బహుకరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను (విద్యార్థులను) ప్రొఫెషనల్ గా తీర్చిదిద్దడంలో కృషి చేసినందుకు అధ్యాపకుల కు మరియు యాజమాన్యానికి సంతోషకరమైన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు గ్రాడ్యుయేషన్ డేను ముగించినట్లు కృతజ్ఞతలు తెలుపుతూ జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.బి.రమేష్ రెడ్డి, డీన్స్, ట్రస్ట్ బోర్డు మెంబర్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తీయ తీయని తేనెల మాటలతో తీస్తారు సుమా గోతులు నమ్మవద్దు!



**వినన్నపేట,జూలై 11 (వార్తాప్రభ) :** పర్సంటేజీలు ప్రామాణికంగా పలు రాష్ట్రాలలో గ్రామ గ్రామాన విస్తరిస్తూ మెడికల్ బ్రాంచ్ కేజీలు పెడుతున్న ఒక సంస్థ 20% తగ్గించి మందుల అందిస్తామని నమ్మబలికి సభ్యులుగా చేర్చుకొని మోసం చేసిన వైనం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలలోకి వెళితే మా సంస్థ నందు మీరు సభ్యత్వం కార్డు తీసుకోవటం వలన 20% లెస్ మీరు ఏ మందులు కొనుగోలు చేసిన ఉంటుందని నమ్మబలికి ఖాతాదారులుగా చేర్చుకోవడం జరుగుతోంది. అవసరమైనప్పుడు సంబంధిత ఖాతాదారుడు మందులు కొనుగోలు కొరకు సభ్యత్వం పొందిన సంబంధిత షాప్ కు వెళితే 20% కు మాకు సంబంధం లేదు 10% మాత్రమే ఇస్తామని చెప్పడంతో అవాక్కావటం సభ్యత్వం పొందిన వారి వంతు అయినట్లు విశ్వాసినియ వర్గాల సమాచారం తెలుస్తోంది.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శస్త్రచికిత్స విజయవంతం కావడంపై మంత్రి కందుల దుర్గేష్ హర్షం

**ఆయన త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్షించిన మంత్రి దుర్గేష్**

**అమరావతి,జూలై 11 (వార్తాప్రభ) :** ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు ముంబయిలో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి కావడం పట్ల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యులు కొన్ని రోజులు విశ్రాంతి తీసుకోవాలని తెలిపినట్లు మంత్రి దుర్గేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అచంచలమైన నిబద్ధత, పట్టుదల గల ప్రజా నాయకుడని, నిరంతరం ప్రజల శ్రేయస్సు, ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధిగా శ్రమిస్తున్నారన్నారు. శస్త్రచికిత్స అనంతరం ఆయన త్వరితగతిన పూర్తి ఆరోగ్యంతో కోలుకోవాలని, మళ్లీ యథావిధిగా ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆయన పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. సమస్య ఏదైనా, ప్రజల్లో ఉంటూ వారి కన్నీళ్లు తుడవాలనే తపన ఉన్న జనసేనాని పవన్ కళ్యాణ్ కు కోట్లాది మంది ప్రజల ఆశీస్సులు, అభిమానుల ప్రార్థనల బలం అండగా ఉన్నాయని, ఆయన తన శారీరక ఇబ్బందులను సైతం లెక్కచేయకుండా నిరంతరం ప్రజల కోసమే తపించే నిఖార్సైన ప్రజా నాయకుడని కొనియాడారు. రాష్ట్ర ప్రగతి ప్రయాణంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కీలక పాత్ర పోషిస్తున్నారని, ఆయన త్వరలోనే పూర్తి శక్తి సామర్థ్యాలతో, రెట్టింపు ఉత్సాహంతో విధుల్లోకి చేరుకుంటారని ఆశిస్తున్నట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఆయన అనారోగ్యంతో ఉన్నా ప్రజా సమస్యలపై ఆలోచన నిరంతరం సాగుతూనే ఉంటుందని, ప్రజాసేవలో అలసట ఎరుగని ఆయన పోరాట పటిమ, దృఢ సంకల్పం మనందరికీ ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.



# 'సర్' పై రాజకీయ పార్టీల నాయకులతో సమీక్షా సమావేశం





**మైలవరం,జూలై 11 (వార్తాప్రభ) :** 82-మైలవరం నియోజకవర్గ పరిధిలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమంలో భాగంగా 82-మైలవరం నియోజకవర్గ పరిధిలో ఓటరు నమోదు అధికారి మరియు జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ, విజయవాడ టి.వి. సతీష్ మైలవరం తహసీల్దార్ కార్యాలయంలో మైలవరం నియోజకవర్గ స్థాయి బీజేపీ ,కాంగ్రెస్, టీడీపీ ,వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ, జనసేన, సీపీఐ, సీపీయం పార్టీల ప్రతినిధులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశములో11.07.2026 తేదీ మధ్యాహ్నం 2 గంటకు 82-మైలవరం నియోజకవర్గ పరిధిలో మొత్తం ఓటర్లు 285168 ఉండగా వారిలో ఇంటింటికి ఓటర్ల ఎన్యూమరేషన్ ఫారములు పంపిణీ 283390 కి పంపిణీ చేయుట జరిగిందని టి.వి.సతీష్ వెల్లడించారు. సేకరించిన ఎన్యూమరేషన్ ఫారముల వివరాలను నిర్దేశిత ఎన్నికల యాప్ 240411 ఓటర్ల వివరములను 85 శాతం నమోదు చేయుటం జరిగిందని తెలిపారు. ఓటర్ల నమోదు చేయుచున్న ప్రక్రియ, అలాగే పోలింగ్ కేంద్రాల వారీగా బూత్ లెవెల్ అధికారులు గుర్తించిన డూప్లికేట్ ఓటర్లు 2926, షిఫ్టింగ్ కేసెస్ 4805, డెత్ కేసెస్ 7690 సంబంధిత వివరాల ను ప్రగతి నివేదికల ఆధారంగా సమీక్షించారు. సదరు సమావేశాలను గ్రామ స్థాయిలో సూపర్ వైజర్లు, బూత్ లెవెల్ అధికారులు వారి వారి బూత్ లెవెల్ ఏజంట్లతోను, మండల స్థాయిలో అందరు సహాయ ఓటరు నమోదు అధికారులు, మండల స్థాయిలో గుర్తింపు పొందిన అన్నీ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశాలు నిర్వహించిన్నట్లు తెలియజేశారు. అలాగే 82-మైలవరం నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని ఓటరు నమోదు అధికారి మరియు జిల్లా మేనేజర్, పౌర సరఫరాల శాఖ, విజయవాడ వారి అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 4గంటలకు గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియు నియోజక వర్గంలోని అందరు సహాయ ఓటరు నమోదు అధికారులుతో సమీక్షా సమావేశం నిర్వహించా రు.బూత్ లెవెల్ అధికారులు గుర్తించి డూప్లికేట్ ఓటర్లు , షిఫ్టింగ్ కేసెస్ , డెత్ కేసెస్ 2 వివరాలను నియోజకవర్గ స్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధు లతో సమీక్షించి, వారి సూచనలు మరియు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. అలాగే స్పెషల్ ఇంటెన్సివ్ రెవిజన్ కార్యక్రమాన్ని భారత ఎన్నికల సంఘం (సర్ )-2026 జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా, సమర్ధవంతంగా మరియు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయడానికి అన్ని చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. ఈ సమీక్షా సమావేశంలో మైలవరం నియోజకవర్గ లోని సహాయ ఓటరు నమోదు అధికారులు, ఎన్నికల సిబ్బంది మరియు వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నియోజకవర్గ స్థాయి ప్రతినిధులు హాజరయ్యారు.

# కోడూరు PHC వద్ద అవగాహన ర్యాలీ




**కోడూరు, జూలై 11 (వార్తాప్రభ) :** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిల్లల మధ్య కనీసం 3 సంవత్సరాల ఎడం పాటిస్తే తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. PHC వైద్యాధికారి డా. రాణి సంయుక్త, CHO M. ©\, PHN పుష్పలత, స్టాఫ్ నర్స్ నాంచారమ్మ, ఫార్మసిస్టు వాణి, హెల్త్ అసిస్టెంట్ వీరాస్వామి, తారకమస్తాను రావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188